నవతెలంగాణ

1

జయశంకర్
ములుగు - భూపాలపల్లి

సోమవారం ఫిబ్రవరి 10, 2025




'ఘట్టం' ముగిసింది

ఉదయం 10:42గంటలకు కుంభాభిషేకం

- పీఠాధిపతి ఆధ్వర్యంలో కుంభాభిషేకం, పూర్ణాహుతి
- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరు
- పూజలతో మార్మోగిన కాళేశ్వరం ఆలయం











నవతెలంగాణ-కాళేశ్వరం

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో 42ఏండ్ల తర్వాత మహా కుంభాభిషేక మహాక్రతువుకు ఆదివారం వేదికైంది. గంగా, యమునా, సరస్వతి సంఘమైన ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళ జ రుగుతున్న తరుణంలోనే కాళేశ్వరం త్రివేణి సంగమంలో మహాకుంభాభిషేక ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయం 10:42గంటలకు మహా కుంభాభిషేక ఘట్టానికి రుత్వి కులు శ్రీకారం చుట్టారు. ఈనెల 7 నుండి 9వ తేది వరకు మూడు రోజుల పాటు మహోత్సవాలు అంగరంగ వైభంగా జరిగాయి. 3వ రోజు కుంభాభిషేక మహెూత్సవ ఘట్టం లో భాగంగా విశేష పూజలు చేశారు. శత చండీ పారా యణం, సహస్రఘట్టాభి షేకం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి సహస్ర ఘట్టాలతో విశేష అభిషేకాన్ని ఘనంగా జరిపారు. వేద పండితులు, శృంగేరి పీఠం తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చి దానంద సరస్వతిచే కుంభాభిషేక మహెూత్సవం నిర్వ హించారు. అనంతరం ఆలయంలో భక్తులకు స్వామి వారు ప్రవచనాలు చెప్పి అందరిని ఆశీర్విదించారు. అ నంతరం రూ.2516 కట్టిన ప్రజలకు కలుష ప్రసాదంని పండితులు అందజేశారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్,రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంకొసింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదిత రులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆల య అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కాళేశ్వరం ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు. అక్కడి నుండి హెూమశాల వద్దకు వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేకం ముగిసిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిం చడంతో ఈ కార్యక్రమం ముగిసిందని ఆలయ ఈఓ మహేష్, అధికారులు తెలిపారు

డాక్టర్ కావాలనే కలకు అడ్డుగా పేదరికం



నవతెలంగాణ-మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కాటారం గ్రామానికి చెందిన ఎస్సీ నేతకాని నిరుపేద కుటుంబానికి చెందిన గంట లక్ష్మి-వెంకటస్వామి దంపతుల కుమార్తె గంట జ్యోత్స్న ఎంబీబీఎస్‌లో సీటు సాధించి ఖమ్మం జిల్లాలోని మమతా మెడికల్ కాలేజీలో 3వ సంవత్సరం చదువుతోంది. వారి తల్లిదండ్రులు వారికి ఉన్న కొద్దిపాటి భూమిని కూతురు చదువు నిమిత్తం అమ్ముకొని విద్య కోసం ఖర్చు చేశారు. ప్రస్తుతం జోత్స్న వాళ్ళ నాన్న బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండగా అమ్మ కూలినాలి చేసుకుం టూ కుటుంబాన్ని పోషిస్తుంది. డాక్టర్ కావాలంటే ఇంకా రెండు సం వత్సరాల చదువు చదవాల్సి ఉంది. కానీ, ఆ చదువు అయ్యే ఖర్చు లను ఆ కుటుంబం భరించే స్థితిలో లేదు. నిరుపేద కుటుంబానికి చెందిన జ్యోత్స్న ఎంబీబీఎస్ చదువు అర్ధాంతంగా ఆగిపోతుందని, డాక్టర్ కావాలని కోరిక నెరవేరలేకపోతుందని ఆవేదన చెందు తోంది. ఊహించని ఖర్చులు ఏర్పడడంతో ఎటుకాని వారం అయ్యా మని ఆవేదన చెందుతోంది. ఫీజులు కట్టకపోవడంతో హాల్ టికెట్ కూడా ఇవ్వడం లేదని, తాను డాక్టర్ అయ్యాక సమాజానికి సేవ చేస్తానని తెలిపింది. దాతలు ముందుకొచ్చి జ్యోత్స్న విద్యాభివృద్ధి కోసం ఆర్థిక సహాయం చేయాలని విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు. పూర్తి వివరాలకు దాతలు 9502678743లో సంప్రదించాలని వేడుకుంటున్నారు.




మినీ మేడారం జాతరకు ముందే...

పోటెత్తుతున్న సందర్శకులు

- క్యూలైన్ల ద్వారా దర్శనం
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు
- సౌకర్యాలు కల్పిస్తున్న దేవదాయశాఖ అధికారులు, పూజారులు
- వనదేవతలను దర్శించుకున్న ప్రముఖులు







నవతెలంగాణ -తాడ్వాయి

ఆసియాలోనే అతిపెద్ద జాతర, తెలంగాణ కుంభమేళా గా మేడారం సమ్మక్క సారమ్మ మహా జాతర జరుగుతుం డగా.. ఈ జాతర ముగిసిన ఏడాదికే అదే మాదిరిగా మినీ మేడం జాతర జరుగుతుంది. ఈ క్రమంలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ మినీ మేడం జాతరను ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు జరగనుంది. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మ హారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి భారీగా సందర్శకులు ముందస్తుగా దర్శనానికి తరలివస్తున్నారు. ఆదివారం సె లవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నా రు. మొదట జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి, కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి వనదేవతల దర్శ నానికి గద్దెల వద్దకు చేరుకున్నారు. వీరికి దేవదాయశాఖ అధికారులు, పూజారులు దగ్గర ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా దర్శనాలు చేస్తున్నారు. తొక్కిస లాట జరగకుండా క్యూలైన్ల ద్వారా దర్శనాలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎండదెబ్బ తగలకుండా చలువ పం దిళ్లునిర్మించారు. ఇంకా మూడు రోజుల సమయం ఉం డగా ముందస్తుగా అధిక సంఖ్యలో సందర్శకులు తరలి వస్తుండడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆదివారం భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రైవేటు వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాకుండా, వాహనాలు పా ర్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేసేలా, దొంగతనాలు అ సాంఘిక కార్యక్రమాలు జరగకుండా బందోబస్తు నిర్వహిం చారు.

వనదేవతలను దర్శించుకున్న ప్రముఖులు

మేడారంలోని మినీ జాతరకు ముందస్తుగా ఆదివారం డిప్యూటీ డ్రగ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా డాక్టర్ అజ్మీర రాం కిషన్ కుటుంబ సమేతంగా, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, రంగారెడ్డి జిల్లా జడ్జి ప్రదీప్‌నాయక్, మహబూ బాబాద్ మాజీ ఎమ్మెల్యేలు ప్రముఖులు సమ్మక్క- సారల మ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు వనదేవతలను దర్శిం చుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు, దేవదాయ శాఖలో ఉన్నతాధికారులు పూజారులు భారీ బందోబస్తు నడుమ ప్రత్యేక పూజలు చేయించారు.

కోటగుళ్లు శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ : ఆలయ అర్చకులు



నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో నిర్వహించే శివరాత్రి మహెూత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. గత 13 సంవత్సరాలుగా ఆలయ పోషకులుగా శివరాత్రి మహెూత్సవాలను నిర్వహిస్తున్న పరకాల వాస్తవ్యులు లలిత నర్సింగ్ హెూమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వర ప్రసాద్ లలితా దేవి, భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ కోడూరు నవీన్‌కుమార్‌సుమతి దంపతులకు ఆదివారం ఆల య అర్చకులు బూరుగుపల్లి మఠం గంగాధర్, జూలపల్లి మఠం నాగరాజు ఆవునూరి మఠం శివకుమార్, కోటగుళ్ళు ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ పత్రికను అందజేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రి మహోత్సవాలకు ముందు కళ్యాణ పత్రికను డాక్టర్ దంపతులకు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాముత్తారం



మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి కాంప్లెక్స్ పరిధి జీలపల్లి, లింగపూర్, మాధారం,కొర్లకుంట, వజినపల్లి, స్థంబంపల్లి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహార యాత్రకి వెళ్లారు, ఈ సందర్భంగా ఉపా ధ్యాయులు, విద్యార్థులకు చారిత్రక కట్టడాలు, వేయి స్తంభాల గుడి, వరంగల్ కోట,భద్రకాళి ఆలయం, జూపార్క్, సైన్స్ సెంటర్, వంటి వాటిని వివరిస్తూ చారిత్రక అంశాలు, సైన్స్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు మట్లా డుతూ విజ్ఞాన విహార యాత్ర ద్వార విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, శాస్త్రీయ విజ్ఞానం పొందుతారని అన్నారు. ఉపాధ్యాయులు, శిరీష, కృష్ణమోహన్, రవి నాయక్, హనుమంతు, సుమలత, జ్యోష్ణ, రాజబాబు, కరుణ, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన పీఏసీఎస్ చైర్మెన్ మొండయ్య

నవతెలంగాణ-మల్హర్‌రావు



మహా కుంభాభిషెకం కార్యక్రమంలో భాగంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో మహాకుంబాబిక మహెూత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు హాజరైయ్యారు. మంత్రులను తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఇప్ప మొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ యన వెంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య, నాయకులు జక్కుల వెంకట స్వామి యాదవ్, అజ్మీరా రాజు నాయక్, అడ్వాల మహేష్, యూత్ నాయకులు రాహుల్, గడ్డం క్రాంతి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి డాక్టర్ దనసరి సీతక్క

నవతెలంగాణ-గోవిందరావుపేట



జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సోమలగడ్డ రహదారి ఎదుట పీఎస్సార్ గార్డెన్స్‌లో మండల అధ్యక్షులు పా లడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సీతక్క హాజరై మాట్లాడారు. రాష్ట ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలం దరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచిం చారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అ మలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా సంవత్సరానికి రూ.12000 చొప్పున అందిస్తుందని అన్నారు. ములుగు నియోజకవర్గంలో సుమారు రూ.30 కోట్ల సీడీఎఫ్ నిధులతో దళిత, గిరిజన వాడల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కల్వర్టులు మంజూరు చేశామన్నారు. ములుగు నూతన బస్టాండ్, ఏటూ రునాగారంలో బస్ డిపోకు నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు. రూ.80 కోట్లతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేశామని, పంచాయితీరాజ్ శాఖ నుండి బీటీ రోడ్లకు సుమారు రూ.310కోట్లు కే టాయించి పనులు ప్రారంభించినట్టు చెప్పారు. నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం అన్నారు. రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, ఏ ఒక్కరికీ కూడా కొత్త రేషన్కార్డులు ఇచ్చిన పా పాన పోలేదని ఎద్దేవా చేశారు. భూమి లేని రైతు కూలీలకు అండగా నిలబడలేదని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఏటా రూ.12000 అందిస్తుందని అన్నారు. బీఆ ర్ఎస్ భూస్వామ్య వ్యవస్థను పెంచి పోషించిందని వందల ఎకరాలు ఉన్న వారికి కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని రైతు బంధు ద్వారా దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నిరుపేదల అభ్యు న్నతికి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు మల్లాది రాంరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యా దవ్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, కార్మికశాఖ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, యూ త్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, గోవిం దరావుపేట మండల సహకార సంఘం అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రస పుత్ సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బీసీ, ఎస్సీలకు న్యాయం

- ఎమ్మెల్యే జీఎస్సార్

నవతెలంగాణ-రేగొండ



కాంగ్రెస్ ప్రభుత్వం లోనే బీసీ కులగణన, ఎ స్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని , కాంగ్రెస్ పాలనలోనే బీసీ, ఎస్సీలకు న్యాయం జరు గుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు అన్నారు. ఆదివారం రేగొండ మండల కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిర్వహిం చిన బీసీ కుల గణన,ఎస్సీ వర్గీకరణ పై అవగాహన ర్యాలీ సదస్సుకు సత్యనారాయణరావు ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి కాంగ్రెస్‌తోనే న్యాయం జరిగిందని అన్నారు. బీసీ కులగనన,ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలి పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన నిలబెట్టుకున్నారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ కూడలి నుండి పెద్ద బస్టాండు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్‌రావ్, ఎన్ ఎస్ ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు, మండల అధ్యక్షులు ఇప్పక్కాయల నరసయ్య, నాయకులు పున్నం రవి, లింగంపల్లి రామారావు, పట్టెమ్ శంకర్, బొజ్జం రవి, మైస బిక్షపతి, మేకల బిక్షపతి, నడిపెల్లి వెంకట్రావు, నిమ్మల విజేందర్, నీరటి భద్రయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మహదేవపూర్



ప్రమాదవశాత్తు చెరువలో పడి వ్యక్తి మృ తిచెందిన సంఘటన ఆదివారం మహదేవపూ ర్ మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. మహదేవ్‌పూర్ ఎస్ఐ కే పవన్‌కుమార్ తెలిపి న వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా హసన్‌పర్తి గ్రామానికి చెందిన మేడం నాగేం దర్(46) పని నిమిత్తం మండలకేంద్రానికి వచ్చాడు. తాగిన మైకంలో బహిర్భూమి నిమి త్తం మండలకేంద్రం లోని ఎర్ర చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.



మినీ మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి

- మంత్రి దనసరి సీతక్క

నవతెలంగాణ -తాడ్వాయి

మినీ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దనసరి సీతక్క అన్నారు. ఆదివారం మేడారం మినీ జాతర పనులను పరిశీలించి, వనదేవతలను దర్శించుకున్నారు. ఎండోమెంట్ అధికారులు పూ జారులు ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క- సారలమ్మ, పగిడిద్దరాజు, గో విందరాజు, వనదేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 12 నుండి నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు 10లక్షల నుండి 20 లక్షలమంది వచ్చే అవకాశం ఉంద న్నారు. ఇందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండల దృష్ట్యా గద్దెల ప్రాంతంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు రూ.5కోట్ల30లక్షలతో వివిధ పనులను పూర్తి చేశామని అన్నారు. పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఎండోమెంట్ ఈవో జేంద్రం, ములుగు డిఎస్పి రవీందర్, పస్రా సీఐ గద్ద రవీందర్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షులు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణస్థాయిలో క్రీడలకు ప్రాధాన్యత : మంత్రి సీతక్క

నవతెలంగాణ-గోవిందరావుపేట



గ్రామీణస్థాయి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యతనిస్తున్నట్టు మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దుంపెళ్లిగూడెం రహదారి పక్కన మెరిట్ స్కూల్ గ్రౌండ్‌లో అరుణోదయ యూత్ క్లబ్ క్రీడా నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి మాస్టర్స్ ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బహుమతుల పంపిణీలో సీతక్క పాల్గొని మాట్లాడారు. బాల్ బ్యాడ్మింటన్ గురించి నేటి యువతకు తెలియదని, కానీ, అరుణోదయ యూత్ ఆధ్వర్యంలో 45 యేండ్ల పైబడిన వారికి టోర్నమెంట్ పెట్టి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. నేను కూడా నాకు తెలిసిన స్వచ్ఛంధ సంస్థల ద్వారా ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని, మీరు కూడా సేవలందించడానికి ముందుకు రావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, గోవిందరావుపేట మండల అరుణోదయ యూత్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
వరంగల్
సోమవారం ఫిబ్రవరి 10, 2025

హామీలు అమలు చేయకుంటే

గ్రామాల్లోకి రైతులు రానివ్వరు

-మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నర్సంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుంటే గ్రామాల్లోకి రైతులు రానివ్వరని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్ది కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు 420 హామీలుగా మారాయన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోస గించిందన్నారు. రెండు లక్షల రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పాగా నమ్మి రైతులు ఆ పై మిగతా డబ్బులు బ్యాంకులు చెల్లించారన్నారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాకపోగా తిరిగి అప్పుల పాలుకావాల్సి వచ్చిందన్నారు. రైతు భరోసా రూ.15వేలు చెప్పి రూ.12వేలకు కుదించేసి వాయిదాలతో కాలం వెళ్లదీస్తున్నార్నారు. రాజ్యాంగం అమలైన రోజు హామీలు అమలు చేస్తామని హామీనిచ్చి కాంగ్రెస్ మాటతప్పిందని విమర్శించారు. ధాన్యంపై క్వింటాకు బోనస్ రూ.500లు ప్రకటించి కేవలం సన్న రకం వడ్లకే బోనస్ ఇస్తామని మాటమార్చిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 86 లక్షల 40 వేల క్వింటాలకు రూ.532 కోట్ల బోనస్ చెల్లించలేదని తెలిపారు. బోనస్ డబ్బుల కోసం రైతులు అధికారుల చుట్టు తిరుగాల్సిన పరిస్థితి దాపరించిందన్నారు. ఓపెన్ మార్కెట్‌లో రూ.3వేల ధర పలికినా ప్రభుత్వాన్ని నమ్మి ధాన్యాన్ని విక్రయిస్తే ఖాతాలలో జమ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షింగా ఉన్నారని పెట్టుబడి సహాయం సకాలంలో అందజేశారని, పంటలకు కావాల్సిన సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం వల్ల వ్యవసాయం పండుగైందన్నారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండగలా మారి కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తిరిగి రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఎదురైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఇచ్చిన హామీల మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రూ.15వేలు, బోనస్ చెల్లించాలని లేకపోతే స్థానిక సంస్థల ఎన్నిల్లో కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగుబాటు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.





అక్రమంగా తుమ్మ చెట్ల నరికివేత

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండలంలోని ఉప్పరపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు (పేచేరువు)లో నల్లతుమ్మ చెట్లను అక్రమంగా నరికి వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన స్వంతానికి తుమ్మ చెట్లను నరికి వేశాడని గ్రామస్తులు ఆరోపించారు. మాజీ ప్రజా ప్రతినిధి నల్ల తుమ్మ చెట్లను అక్రమంగా నాలుగు ట్రాక్టర్ల లోడ్లను అమ్ముకున్నట్లు తెలిపారు.ఈ విషయంపై స్థానిక గ్రామ కార్యదర్శిని సమాచారం అడగగా మాజీ ప్రజా ప్రతినిధి తుమ్మ చెట్లు నరకడం వాస్తవమేనని, ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు తెలిపారు. తుమ్మచెట్లను నరికిన వ్యక్తికి నోటీసులు ఇస్తామని తెలిపారు. మాజీ ప్రజా ప్రతినిధిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నల్ల తుమ్మ చెట్లను రికవరీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చట్టసభల్లో ముందుండేలా ప్రభుత్వం కృషి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్‌నాయక్

నవతెలంగాణ-పర్వతగిరి

బీసీ,ఎస్సీ,ఎస్టీలకు చట్ట సభల్లో ముందుండేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల సమావేశానికి కూడా దొరవారే నాయకత్వం వహించాలా.. బీసీల అంశంపై మాట్లాడడానికి నిర్ణయాలు తీసుకోవడానికి బీఆర్ఎస్‌లో బీసీ నేతలు ఎవరు లేరా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14నెలలోనే బీసీ డిక్లరేషన్, ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం అని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు, ఎస్సీలకుగానీ చట్టసభల్లో ముందుండేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు కూసం రామచందర్, బూత్ కన్వీనర్లు బొట్ల కనకరాజు, బొట్ల వెంకన్న, వంగ సాయి, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గోపనపల్లి దూడల మల్లికార్జునస్వామి ఆలయ అభివృధి పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివద్ధి కమిటీకి అదే గ్రామానికి చెందిన బెల్లం పెద్ద ఎంకులు-కొమురమ్మల కొడుకు కోడలు మహేందర్-శోభ ఆదివారం రూ.15,116లు విరాళముగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన దోనికే కొమురయ్య-యాదమ్మ దంపతులు ఆలయ పునర్నిర్మాణానికి గాను రూ.10,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.

చిన్నారులకు కాంగ్రెస్ నాయకుల ఆశీర్వాదాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని దౌలత్ నగర్‌కు చెందిన ఆంజాద్‌పాషా కూతురు, కుమారుని శారీ, పంచె కట్టు వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి కోఆప్షన్ ఎండి సర్వర్, సీనియర్ నాయకులు కత్తుల ఐలయ్య, ధోనికి కొమురయ్య, అయినవోలు దేవస్థానం డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అబ్రపురి వెంకటేశ్వర్లు, పర్వతగిరి టౌన్ అధ్యక్షులు కూసం రామచందర్, బూత్ కన్వీనర్ వంగసాయి, పర్వతగిరి మాజీ ఉప సర్పంచ్ రంగు జనార్ధన్, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కనకరాజు బొట్ల వెంకన్న, ఎస్టి సెల్ నాయకులు కిషన్ నాయక్, బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.



కంఠమహేశ్వరస్వామికి 'దొంతి' ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-చెన్నారావుపేట




గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠ మహేశ్వర స్వామికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని లింగగిరి గ్రామంలో గౌడ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం కబ్జా

పట్టణ ప్రణాళిక అనుమతుల వెనుక మతలబు..!
కొనసాగుతున్న ఆక్రమణల పర్వం..
ప్రభుత్వ భూములు కనుమరుగు

నవతెలంగాణ-నర్సంపేట

పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడిక్కడా కబ్జాల పాలవుతున్నాయి.. ఆక్రమణలు అరికట్టాల్సిన రెవిన్యూ, మున్సిపల్ అధికారుల్లో పట్టింపు కొరవడింది.. రిజిస్ట్రేషన్, పట్టణ ప్రణాళిక శాఖల్లో అవినీతి తాండవిస్తుంది.. చేతివాటంతో ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితం ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు.. నిబంధనలకు విరుద్ధమైన కట్టాడాలకు రెక్కలొచ్చాయి. మచ్చుకు వరంగల్ రోడ్డులోని ప్రధాన రహదారిలో సర్వే నెంబర్ 702లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలే ఇందుకు నిదర్శంగా కన్పిస్తుంది.. కొట్లాది విలువైన ఈ ప్రభుత్వ, అసైండ్ భూములు ఆక్రమితకు గురైతున్నా అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంపై పట్టణ పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జానెడు జాగ కోసం ఎర్ర జెండా నీడన యేండ్ల తరబడి పోరాడుతున్న ఇచ్చేందుకు అధికారులకు కనికరం లేకుండా పోయిందని పేదలు వాపోతున్నారు. అదే పలుకుపడిన వ్యక్తులు మాత్రం

కలెక్టర్ గారూ.. స్పందిస్తే..
సర్కారు స్వాధీనంలోకి కోట్లు పలికే భూములు





(ఫైల్)

ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలకు దర్జాగా అనుమతులు ఇచ్చేసి కట్టబెడుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ అనుమతులు, నిర్మాణాలపై విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సర్వే నెంబర్ 702 లోని ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు..

పట్టణంలోని వరంగల్ రోడ్డులోని సర్వే నెంబర్ 702లోని ప్రభుత్వ, అసైండ్ స్థలాలు ఎక్కడిక్కడా ఆక్రమించేశారు. 2011లో అప్పటి కలెక్టర్ స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లను నియమాకం చేసి ప్రత్యేక సర్వేయర్‌ల బృందంచే ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. ఈ మేరకు పట్టణంలోని సర్వే నెంబర్ 111, 702, 601, 121 తదితర ప్రభుత్వ భూముల్లో హద్దులు పాతి పరిరక్షించే చర్యలు చేపట్టారు. కొంతకాలనికి వరంగల్ రోడ్డులో పలు ప్రదేశాల్లో ఆక్రమదారులు హద్దు రాళ్లను తొలగించేశారు. కొందరు పక్క సర్వే నెంబర్‌తో మరికొందరు ఇంటి నెంబర్‌ల పేరిట రిజిస్ట్రేషన్‌లు చేసుకొని డాక్యూమెంట్‌లను సృష్టించారు. ప్రభుత్వ లావాణీ, లేదా పట్టా భూమి, నాలా అనుమతులు, లింకు డాక్యుమెంట్‌లు తదితర రికార్డులను పరిశీలించ కుండనే సృష్టించుకున్న ఇంటి నెంబర్‌ల పేరిట అధికారులు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెల్సుతుంది. మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలపై కూడా ఎల్ఆర్ఎస్ చెల్లిస్తే పట్టణ ప్రణాళిక శాఖ అధికారులు అనుమతులు ఇచ్చేశారు. వరంగల్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి కోట్లాదిగా ధర పలుకుతున్న దాదాపు 500ల చదరపు గజాలపైగా స్థలాన్ని ఆధీనంలోకి తీసుకొన్నాడు. ఆక్రమణ అనుమానాలు రాకుండా తొలత రేకుల షెడ్డు వేసి ఇంజనీరింగ్ వర్క్‌షాపు నిర్మాణం చేపట్టి కొనసాగి స్తున్నాడు. దీని వెనుక భాగంలో మున్సిపాలిటీ అధికారులు జీప్లస్ టూ భవన అనుమతులు ఇచ్చేశారు. నిర్మాణ స్థలం ఏ సర్వే నెంబర్ పరిధిలోకి వస్తుందో పరిశీలించకుండనే అనుమతి ఇచ్చినట్లు తెల్సుతుంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓ పలుకుపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ధర్జాగా పెద్ద భవంతే నిర్మాణం చేశాడు. అయినా రెవిన్యూ, మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇదే సర్వే నెంబర్‌లో పక్కనే మరో వ్యక్తి నిర్మాణాలు చేస్తుండగా మాత్రం అటు రెవిన్యూ, ఇటు మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద నిలిపివేసి ప్రభుత్వ స్థలం అంటూ బోర్డును తలిగించారు. పట్టణంలోని 111 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ అసైండ్ స్థలాల్లో సామాన్య పేదలు ఉండేందుకు ఇల్లు నిర్మాణం చేస్తుండగా తట్టా పార లా క్కొని నిలివేసి నానా బీభ త్సవం సృ ష్టించారు. పలు చోట్ల ఏకంగా జేసీబీతో పిల్లర్లను కూల్చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిబంధనలకు విరు ద్ధమైన బడాబాబుల అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలు మాత్రం మున్సిపాలిటీ అధికారుల కంటికి కనపడక పోవడం శోచనీయంగా మారింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఈ అక్రమ అనుమతులపై విచారణ చేపట్టి పట్టణంలోని అక్రమ కట్టడాలను నియంత్రించే చర్యలు తీసుకొన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'స్టేషన్'లో ఏడాదిలో రూ.1000 కోట్ల పనులు

ఉప ఎన్నికలొస్తే ఎదుర్కొంటా..

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలో రూ.800కోట్ల అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యాయని, మరో రూ.200 కోట్ల పనులకు ఉత్తర్వులు రావాల్సి వుందని, ఎన్నికల కోడ్ ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేస్తారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం ఉదయం హన్మకొండలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. 15 ఏండ్ల విరామం తరువాత నన్ను ఎమ్మెల్యేగా ఎంతో నమ్మకంతో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు గెలిపించారన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఎన్నో హామిలిచ్చానని గుర్తు చేశారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని భావించి ప్రజలు గెలిపించారన్నారు. ఈ క్రమంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం, ఆ పార్టీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ నేతలతో సంప్రదించి వారి అభిప్రాయాల మేరకు కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. ఈ చేరికను ప్రజలు కూడా మద్దతిచ్చారన్నారు. ఇందుకు ప్రధాన ఉదాహరణ పార్లమెంటు ఎన్నికల్లో 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నింట్లోకి స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా 55వేల ఓట్ల భారీ ఆధిక్యత లభించిందన్నారు. కాంగ్రెస్‌లో చేరి 11నెలలు గడిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వ సహకారం, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయడంలో భాగంగా తొలిదశలో 28పాఠశాలలను మంజూరు చేసింద న్నారు. ఇందులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఒక స్కూల్ మంజూరయ్యిందన్నారు. రూ.200 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు ప్రత్యేకంగా క్యాంపస్‌లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను జఫర్‌గఢ్ మండలం కోనాయచలంలో నిర్మించడానికి భూమిని గుర్తించినట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభమవు తాయన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ పంచాయతీని మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. మేం చేస్తున్న పనులన్నీ గతంలోనే మంజూరైనట్లు బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకే ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి రూ.45.50 కోట్లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆర్టీసి డిపో కోసం 4ఎకరాల భూమిని సేకరించి ఆర్టీసికి అప్పగించామన్నారు. ఆ భూమిని ఆర్టీసితో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి వంద పడకల ఆసుపత్రికి ఇప్పించారన్నారు.

'స్టేషన్'లో ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్ రూ.26 కోట్లు

స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే 22 ప్రభుత్వ శాఖలు ఒకే క్యాంపస్‌లో ప్రజలకు అందుబాటులోకి వస్తా యన్నారు. దేవాదుల ప్రాజెక్టు కింద స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుండి నవాబ్‌పేట రిజర్వాయర్ వరకు వున్న కాలువకు లైనింగ్ పనుల నిమిత్తం రూ.148.76 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద నియోజకవర్గంలోని 7మండలాల్లో 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందాల్సి వుండగా, ప్రస్తుతం 60-70వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందుతుందన్నారు. రూ.30 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని నిర్మించనున్నట్లు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి తొలుత ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డిగ్రీ కాలేజీ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రూ.53 కోట్లతో నూతన రోడ్లను నిర్మించనున్నారు.

రూ.10 కోట్లతో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు

నియోజకవర్గంలో రూ.10 కోట్లతో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు చెప్పారు. కుర్చపల్లి, సాగరం, కొండాపూర్‌లలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్లు వివరించారు. ఎన్పీడిసిఎల్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయానికి రూ.1 కోటి మంజూరయ్యాయన్నారు. వేలేరు మండలం పీచరలో 220/132 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు రానున్నాయని, ఈ నిధులు వచ్చి పనులు పూర్తయితే లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. కుడా, ఎస్‌డిఎఫ్‌ల నుండి రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరయ్యాయన్నారు. మరో 1,500 ఇండ్లు కావాలని అడగ్గానే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి మంజూరు చేయడానికి అంగీకరించారన్నారు. ఇండ్లకు సంబంధించే రూ.250 కోట్ల మేరకు పేదలు లబ్దిపొందే అవకాశం దక్కనుందన్నారు. పంచాయతీరాజ్ శాఖలో రూ.80 కోట్లు, ఆర్ అండ్ బిలో రూ.120 కోట్ల మేరకు రోడ్ల నిర్మా ణానికి సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో వున్నాయన్నారు. పెద్దపెండ్యాల, కంచన పల్లి, చిల్పూర్‌లలో మూడు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి)ల నిర్మాణానికి ప్రతిపాదనలను సమర్పించామన్నారు.

ధర్మసాగర్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టు

ధర్మసాగర్ మండలం దేవునూరు ఇనుపరాతి గుట్టలు 4వేల ఎకరాల్లో విస్తరించి వున్నాయని, ఆ గుట్టల నుండి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోని గుట్టకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. 'కుడా' ద్వారా ఎకో టూరిజం ప్రాజెక్టు పనులను ఇక్కడ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆక్సీజన్ పార్క్, ట్రెక్కింగ్, సైక్లింగ్‌కు సంబంధించిన ట్రాక్‌ల ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మారజోడు రాంబాబు, రాజేశ్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు పరామర్శ

నవతెలంగాణ-కాశిబుగ్గ

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకుడు ఆరూరి రమేష్ తల్లి ఆరూరి వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌కు చెందిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఆరూరి రమేష్‌ను పరామర్శించారు. జనగామ జిల్లా జాఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లులో డివిజన్ నాయకులు వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆరూరి రమేష్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బిజెపి నాయకుడు ముడుసు నరసింహ, బీఆర్ఎస్ నాయకులు గంద్రాతి భాస్కర్, పసులాది మల్లయ్య, కొత్తపల్లి యాదగిరి,, బావండ్లపల్లి కిరణ్ కుమార్, పల్లెపాటి రమేష్‌రెడ్డి, నాయిని క్రిష్ణ, పసులాది చంద్రం, మేకల ప్రవీణ్ పాల్గొన్నారు.

పర్వతగిరి : అరూరి రమేష్ తల్లి అరూరి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి స్వగృహంలో పర్వతగిరి మండలంలోని ఏనుగల్ గ్రామ మాజీ



ఎంపీటీసీ కోల మల్లయ్య, మాజీ ఉప సర్పంచ్ సతీష్ రావు, ఆత్మ మాజీ డైరెక్టర్ బుక్క కుమార్, టీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మసాని వెంకట్ బీజేపీ జిల్లా నాయకులు గూడ నరేందర్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఇందిరాపార్కు వద్ద నేటి

ప్రజాసంఘాల ధర్నాను జయప్రదం చేయండి

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలి గంటి రత్నమాల

నవతెలంగాణ-వరంగల్

ఇందిరా పార్క్ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కిలా వరంగల్ ఐద్వాజిల్లా కమిటీ సభ్యులు ఠాగూర్ భవాని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ధర్నాలో, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల పాల్గొని మాట్లాడుతూ సోమవారం ఫిబ్రవరి 10వ తేదీ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా ధర్నా నిర్వహించబడుతుందన్నారు. ఈ ధర్నాలో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26వ సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పేదలను విస్మరించి, కార్పొరేట్లకు ఖజానా నింపే బడ్జెట్ గా ఉందని, అందుకే కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ అన్ని ప్రజా సంఘాలు ధర్నాను నిర్వహిస్తున్నమని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో మహిళా సంక్షేమానికి, విద్య వైద్యానికి ఉపాధికి సంబంధించిన నిధులు కేటాయించడంలో మోడీ సర్కార్ కు చిత్తశుద్ధి లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంలో తగ్గించడంలో కేంద్రం విఫలమైంద న్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్లనే ఎక్కువ మంది యువత అమెరికాకు వలస వెళ్లి బ్రతకవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రం యువతకు ఉపాధి కల్పించడంలో కూడా విఫలం చెందిందని అన్నారు. ఈ ధర్నాలు కొత్త రమ్య, పెట్టే స్వప్న, తోటకూరి రమ, కొత్త మల్లికాంబ, తోటకూర పద్మ, మందాటి సరిత, కొత్త శ్రీనిధి, ఉద్విత, శ్రీ మహాన్విత తదితరులు పాల్గొన్నారు



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన వర్ధన్నపేట జేపీసీ నాయకులు

నవతెలంగాణ-వర్ధన్నపేట

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి,ఎస్సి వర్గీకరణ సబ్ కమిటీ కో చైర్మన్, దామోదర రాజనర్సింహను ఆదివారం వర్ధన్నపేట అంబేద్కరిజం జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆమోదించిన ఎస్సి వర్గీకరణ ప్రక్రియలో సబ్ కమిటీ కో చైర్మన్, కేబినెట్ హోదాలో కీలక భూమిక పోషించిన మంత్రి దామోదర రాజనర్సింహకి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ ఆమోదాన్ని పునఃసమీక్షించి జరిగిన పొరపాట్లను సవరింపజేసి త్వరగా ప్రభుత్వం ద్వారా జీవో విడుదల చేయించాలని వినతిపత్రం సమర్పించారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ టీచర్ నియోజకవర్గం ఎన్నికలు పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకుకలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
3
హనుమకొండ
సోమవారం ఫిబ్రవరి 10, 2025 www.navatelangana.com

రేషన్ కార్డుల జాబితా డాట ఎంట్రీ

నవతెలంగాణ-శాయంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందజేయనున్న జాబితాను ఆదివారం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది ఎక్సెల్ షీట్లో డాట ఎంట్రీ చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా పాలనలో గ్రామసభలలో రేషన్కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాను రేషన్ డీలర్ల సమక్షంలో ఎక్సెల్ షీట్లో డాట ఎంట్రీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్లు తమ షాపు పరిధికి వచ్చే లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి తమ షాపు నెంబర్లు వేశారు. డాట ఎంట్రీ పూర్తి చేసిన తర్వాత సివిల్ సప్లయ్ ఆఫీసుకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ డాట ఎంట్రీలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభావతి. ఆర రమేష్‌బన్నా, ఆర్పి రమేష్, రెవెన్యూ సిబ్బంది. రేషన్ డీలర్లు, కార్యాలయ సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



వాకర్స్ అసోసియేషన్ గవర్నర్‌గా 'భారతి'

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వాకర్స్ ఇంటర్నేషనల్ హన్మకొండ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా రిటైర్డ్ లేబర్ కమిషనర్ కూరాకుల భారతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గత గవర్నర్ నుంచి భారతికి హనుమకొండ జిల్లా బాధ్యతలను అప్పగిస్తున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి తెలిపారు. వాకర్స్‌కు ఎల్లవేళలా అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా భారతి పని చేయాలని ఆమె సూచించారు. అనంతరం కురాకుల భారతి మాట్లాడుతూతనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించి గవర్నర్‌గా అవకాశం కల్పించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరికీ రుణపడి ఉంటానని అన్నారు. జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడి వాకర్స్ సమస్యలు అన్నిటిని పరిష్కరిస్తానని భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, వాకర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా మాజీ గవర్నర్ కుమారస్వామి, రాంచంద్రం,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కేయూసి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రమదానం

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

పరిసరాల పరిశుభ్రత ద్వారా కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం కేయుసి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సిబ్బందితో కలసి చెత్తను తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. మొక్కలను పెంచేందుకు స్టేషన్ సిబ్బందితో కలసి ప్రణాళికను రూపొందించుకొని త్వరలో మొక్కల ఏర్పాటుకు పోలీసులు సిద్ధమవుతున్నట్టు తెలిపారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కుక్కముడి మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోరెడ్డి మహేందర్‌రెడ్డి ఆదివారం మొగిలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి, మనోధైర్యాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి వారు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు గౌరు రాజిరెడ్డి, బండారి మొగిలి, చందరాజు సంతోష్, మాదం దేవేందర్, బైరి సునీల్, తోట భాస్కర్, కుక్కముడి రాజు ఉన్నారు.



ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

-డాక్టర్ ఎన్ రాంబాబు

నవతెలంగాణ-శాయంపేట

ప్రతి ఒక్కరు ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ ఎన్ రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతు శ్రీరామచంద్ర మిషన్ ద్వార హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 14 శుక్రవారం నుండి 16 ఆదివారం వరకు మూడు రోజుల పాటు నవోదయ ఉన్నత పాఠశాలలో ధ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ధ్యాన శిబిరానికి అధిక సంఖ్యలో పాల్గొని పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. ధ్యాన శిబిరాన్ని ఉచితంగ ఇచ్చిన నవోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మామిడి పద్మకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శారద. ట్రైనర్ నీరజ, అభ్యాసకులు జనార్ధన్. శాగంటి స్వామి పాల్గొన్నారు.



కోటగుళ్లలో సండే సందడి

వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన విద్యార్థులు

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఆదివారం వివిధ జిల్లాల నుండి పాఠశాల విద్యార్థులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బస్సులు వ్యాన్లలో కోటగుళ్ళకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపా ధ్యాయులు ఆలయ చరిత్రను శిల్పసంపద విశిష్టతను తమ విద్యార్థులకు వివరించారు. మంగపేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఎంఈఓ పి.మేనక ఉపాధ్యాయ బృందం వారి విద్యార్థులతో కలిసి కోట గుళ్ళ నుసందర్శించారు.

13న ఉచితంగా కంటి ఆపరేషన్లు

నవతెలంగాణ- మహదేవపూర్

కంటి ఆపరేషన్ చేయించుకునే వారి కోసం 13వ తేదీన కరీంనగర్ కంటి ఆస్పత్రి నుండి కంటి ఆపరేషన్ చేయించుకునే వారి కోసం బస్సు భూపాలపల్లి కి ఉదయం 10 గంటలకి హనుమాన్ టెంపుల్ (పాత అంగడి) దగ్గరికి వస్తుంది డాక్టర్లు కంటి సమస్యతో బాధపడే వారిని పరీక్షించి కంటి ఆస్పటల్‌కు తీసుకువెళ్లి ఉచితంగానే కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిల్ మారుతి ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఆపరేషన్ అనంతరం కండ్ల అద్దాలు మందులు ఉచితం ఇవ్వబడునున్నట్టు తెలిపారు. భోజన సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. బస్సు సౌకర్యం కూడా ఉచితంగానే ఉటుందని, కంటి ఆపరేషన్ చేయించుకునే వినియోగించుకోవాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్ లో యువతకు మరోసారి అన్యాయం

డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మంద సుచందర్

నవతెలంగాణ-హసన్‌పర్తి



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ దేశ యువతకు మరోసారి తీవ్ర నిరాశను మిగిల్చిందని డివైఎఫ్ఐ మండలం కార్యదర్శి మంద సుచందర్ అన్నారు.ఆదివారం హసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వద్ద ఏర్పాటు చేసిన డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా సుచందర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు సష్టించేందుకు, విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు తగిన ప్రణాళికలు లేకుండా, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా బడ్జెట్ రూపొందించబడిందని అన్నారు.దేశంలో నిరుద్యోగిత తీవ్రంగా పెరుగుతుండగా, కొత్తగా ఉద్యోగ అవకాశాలు సష్టించే విధమైన చర్యలు ఈ బడ్జెట్‌లో కనిపించలేదని,ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోత కొనసాగిస్తూ, నిరుద్యోగ యువతను మరింత నిరాశకు గురిచేశారని తెలిపారు.విద్యా రంగానికి తక్కువ బడ్జెట్ కేటాయించి,ప్రభుత్వ విద్యా సంస్థలకు తగిన విధంగా నిధులు కేటాయించలేదని అన్నారు.ప్రైవేటీకరణను ప్రోత్సహించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం, సామాన్యుల పిల్లలకు ఉన్నత విద్యను కలవరపెట్టేలా ఉందని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహిస్తూ, శాశ్వత ఉద్యోగ భద్రతను దూరం చేస్తోందని, అర్థిక అసమతుల్యతను పెంచేలా కార్మిక హక్కులను హరించే విధానం కొనసాగిందని తెలిపారు. విద్యార్థి రుణాలపై వ్యాజ్యాలు పెరిగాయని,స్కాలర్‌షిప్‌లు తక్కువయ్యాయని సామాన్య వర్గాల విద్యార్థులకు సదుపాయాలు కల్పించక పోవడం వల్ల పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఈ బడ్జెట్ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉందని, డివైఎఫ్ఐ ఈ బడ్జెట్‌ను ఖండిస్తూ, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడుతుందని సుచందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, మండల కార్యకర్తలు సుమన్, హర్ష, సుధాకర్, తిరుపతి, వెంకన్న, వరప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ సౌందర్యానికి అవగాహన ముఖ్యం

ఇంటర్నేషనల్ సీనియర్ మేకప్ ఆర్టిస్ట్ సంతోషి శ్రీకర్స్

ఫ్లష్ అకాడమీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ సెమినార్

అకాడమీ ఆర్గనైజర్ కర్రీ విశ్వనాథ్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మారుతున్న కాలానికి అనుగుణంగా ముఖ సౌందర్యాన్ని మెరుగు పరిచేందుకు ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు ఉత్పన్నమవుతున్న తరుణంలో బ్యూటీషియన్స్‌కు నైపుణ్యాల కల్పన కోసం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా నయీమ్ నగర్‌లోని ఎమ్మార్ గ్రాండ్ హోటల్లో శనివారం రికోడ్ సంస్థ సహకారంతో సిగ్నేచర్ ఈవెంట్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లష్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంతోషి శ్రీకార్స్ పాల్గొన్నారు. ట్రైసిటీస్, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బ్యూటీ పార్లర్ నిర్వాహకులు ముందుగా వివిధ విభాగాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని 300కు పైగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంతోషి శ్రీకార్ బ్యూటిషన్ మేకప్ సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. మొదట ఫేస్ మేకకు సంబంధించి వివిధ రకాల మెరుగైన పద్ధతులను పాటిస్తూ శిక్షణ ఇచ్చారు. అన్ని శుభకార్యాలకు సంబంధించి స్త్రీలను అందంగా తీర్చిదిద్దడానికి వారి చర్మానికి తగిన విధంగా ఎలాంటి మేకప్‌లు వేస్తే వారి ముఖ సౌందర్యం అందంగా కనబడేవిధంగా వివిధ రకాల కాస్మోటిక్‌ను ఎలా ఉపయోగించాలో వివరించారు. వాతావరణానికి అనుగుణంగా స్త్రీల చర్మ సౌందర్యాన్ని బ్యూటిషన్లు పాటించవలసిన నియమ నిబంధనలను అర్థమయ్యే విధంగా వివరించారు. వివిధ రకాల హెయిర్ స్టైల్స్, ఆకట్టుకునే డిజైన్లతో జుట్టు సౌందర్యాలు మరింత మెరుగుపడేందుకు బ్యూటిషన్లు పాటించవలసిన అంశాలను క్లుప్తంగా వివరించారు. కస్టమర్ల అభిరుచులను అర్థం చేసుకొని మరింత మెరుగుపరిచేందుకు నిష్ణాతులైన అనుభవజ్ఞుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటించి బ్యూటిషన్ కెరియర్లో మరింత అభివృద్ధి చెందవచ్చు అని సంతోషి శ్రీ కార్స్ తెలిపారు. ఒకరోజు శిక్షణ పూర్తి చేసుకున్న బ్యూటిషన్లకు కాస్మోటిక్స్ కిట్టుతో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లష్ అకాడమీ ఈవెంట్ ఆర్గనైజర్ కర్రీ విశ్వనాథ్, ప్రశాంతి సోను రజియా శశి స్నేహ నవనీత బోను సజన తదితరులు పాల్గొన్నారు.

మెగా హెల్త్ క్యాంపు విజయవంతం

నా గ్రామంలో ఒక్కప్రాణం కాపాడిన నా జన్మ ధన్యం

కార్డియాలజిస్ట్ డాక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-నడికూడ



మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ మౌనిక ఫిజియాలజీ దంపతుల ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషల్టీ హాస్పిటల్ వివిధ విభాగాల వైద్య బృందం హైదరాబాద్, డీఎంహెచ్ఓ-హనుమకొండ జిల్లా, పిహెచ్సి రాయపర్తి వారి సహకారంతో కౌకొండ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత మెగావైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కౌకొండ గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు 300మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నికిత, స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ దివ్య, ఆర్థోపెడిక్ డాక్టర్ వినీత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కళ్యాణి,కంటి డాక్టర్ మహేష్, డెంటల్ డాక్టర్లు విగ్నేష్, డాక్టర్ తేజస్వి తదితర సుదీర్ఘ అనుభవం ఉన్న హైదరాబాద్ డాక్టర్స్‌తో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డిఈకో, కంటి పరీక్షలు, డెంటల్ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, షుగర్ టెస్ట్ లు చేశారు. ఈ క్యాంపు నిర్వహణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న డాక్టర్ చంద్రమోహన్ డాక్టర్ మౌనిక దంపతులకు కౌకొండ గ్రామ ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామంలో ఒక్క ప్రాణాన్ని కాపాడిన నాకు మనశ్శాంతి దొరుకుతుందని, కొద్ది రోజుల క్రితమే మా సొంత వదినమ్మ క్యాన్సర్ బారిన పడి మృతి చెందారని, ఎంతోమంది గుండెపోటుతో మృతి చెందారని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమోహన్‌ను గ్రామస్తులు మిత్రులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ డిటీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్, మాజీ సర్పంచ్ మేకల రమేష్, జిల్లా పరిషత్ విద్యా కమిటీ చైర్మన్ గోల్కొండ అరుణ, ప్రైమరీ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ సుకన్య, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల రవి, కారోబార్ శంకర్, ఏఎన్ఎం లు సులోచన, సునీత, ఇందిరా, హెల్త్ సూపర్వైజర్ సాంబయ్య, హెల్త్ అసిస్టెంట్లు వేణుగోపాల్, శ్రీనివాస్, శర్మ, ఆశ వర్కర్లు లలిత, లీల, రజిత, లలిత, స్వప్న, అలాగే కార్యక్రమానికి సహకరించిన ఉప సర్పంచ్ ముక్కెర సురేష్, పాలడుగుల రవి, మేకల చిరంజీవి, ముక్కెర సురేష్, మేకల రఘుపతి, పూరెళ్ల భాస్కర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రేవూరి

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని కామారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాదారపు చిరంజీవి-శిరీష కూతురి పుష్పాలంకరణ మహోత్సవానికి ఆదివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించి కానుక అందించారు. ఎమ్మెల్యే వెంట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రేవూరి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు పర్వతగిరి రాజు, బూర రాజేందర్, లక్కర్స్ ముత్తయ్య, కామారం గ్రామ పార్టీ అధ్యక్షులు లక్కర్స్ రాజు ,కాంగ్రెస్ నాయకులు అలువాల రవి, ఎలగొండ మొగిలి, ప్రతాప్ రెడ్డి, లింగమూర్తి, కంది కమలాకర్ రెడ్డి, సానాబోయిన శీను, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-ఎల్కతుర్తి



ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టు కున్నట్లు ఎస్సై అక్కినేపల్లి ప్రవీణ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని కోతులనడుమ గ్రామ శివారులోని వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని అల్లం సాంబరాజుపై కేసు నమోదు చేసుకొని తహసీల్దార్ ముందుకు బైండోవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు.



మృతురాలి కుటుంబానికి అండగా చేగువేరా యూత్

నవతెలంగాణ-పరకాల

పరకాల పట్టణంలోని రెండో వార్డుకు చెందిన శనిగరపు ప్రమీల కొద్దిరోజుల క్రితం మరణించగా వారి కుటుంబానికి ఆదివరాం చేగువేరా యూత్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. వార్డులో ఏ కుటుంబానికి ఆపద వచ్చిన చేగువేరా యూత్ అండగా ఉంటుందని యూత్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బొచ్చు అనిల్, బొచ్చు కళ్యాణ్, బొచ్చు నాగరాజు, రాయరాకుల అనిల్, బొచ్చు కిషోర్, బొచ్చు రాజు, ఒంటేరు కళ్యాణ్, చరణ్ చిరంజీవి, మంద రోషన్, శశికుమార్, శీను, బొమ్మకంటి సృజన పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పరకాల



మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎన్ను కున్నట్టు రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్‌మాదిగ తెలిపారు. గ్రామ కమిటీ నూతన అధ్య క్షుడిగా మంగళపల్లి రమేష్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, చిలువేరు అనిల్, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు తిరుపతి, కార్యదర్శిగా మంగళపల్లి రమేష్, చిలువేరు కుమారస్వామి, ప్రచార కార్యదర్శిగా మంగళపల్లి గని,కోశాధికారిగా మంగళపల్లి రాజు, గౌరవ సలహాదారులుగా చిలువేరు మల్లయ్య, మాదిగ చిలువేరు శంకర్, మంగళపల్లి కుమారస్వామి, రేణికుంట్ల సుభాష్, మంగళపల్లి శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ఏకు శంకర్ తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

నవతెలంగాణ-టేకుమట్ల

టేకుమట్ల మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాలేశ్వరం పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో ఎంపేడు గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులతో కలిసి టేకుమట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్ విన్నవించి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హుజురాబాద్ డిపో బస్సు జమ్మికుంట, వావిలాల, ఎంపేడు, బోర్నపల్లి, వెంకటరావుపల్లి, మీదుగా, పరకాల డిపో బస్సు మొగుళ్ళపల్లి, నవాబ్ పేట, సుబ్బక్కపల్లి ,అంకుషాపూర్, టేకుమట్ల, మీదుగా వెలిశాల వెంకట్రావుపల్లి, జోడుపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసంపల్లి పోషలు, రమేష్,దేశిని మొగిలి, నేరెళ్ల తిరుపతి, గాజర్ల విష్ణు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా

జల్లారపు ప్రసాద్ నియామకం

నవతెలంగాణ-మల్హర్‌రావు



తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టిఆర్పీఎస్)మండల అధ్యక్షుడుగా మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన జల్లారపు ప్రసాద్ ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎల గొండ రాజేంద్రప్రసాద్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలి పారు. తనపై నమ్మకంతో టిఆర్పీ ఎస్ అధ్యక్షులుగా నియ మించిన జిల్లా అధ్యక్షులు ఎలగొండ రాజేంద్ర ప్రసాద్ కు జిల్లా, రాష్ట్ర కార్యవర్గ నాయకులకు ప్రసాద్ ప్రత్యేక క తజ్ఞతలు తెలియజేశారు. పద్మశాలిల ఐక్యతకు,సంఘ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అడ్డగట్ల శ్రీధర్, రాష్ట్ర నాయకులు ముడితనపెల్లి ప్రభాకర్, కొలిపాక ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కుసుమ శ్యాం ప్రసాద్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతం అనీల్ కుమార్ పాల్గొన్నారు.



బోర్లగూడెంను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలి

మండల సాధన సమితి మంత్రికి వినతి

నవతెలంగాణ-మహదేవపూర్

మహాకుంభాభిషేకానికి ఆదివారం కాళేశ్వరం వచ్చిన రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసన సభ వ్యవారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును భోర్లగూడెం మండల సాధన సమితి కన్వీనర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మలోత్ నవారామ్ నాయక్ నాయకులతో కలిసి కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు మండలం కావాలని కోరుతున్నారని, ప్రజల కోరిక మేరకు ప్రత్యేక చొరవ చూపి తక్షణమే మండలం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మంత్రి స్పందించి ఇప్పుడు ఎన్నికల కోడ్ వున్నందున ఈ విషయంపై తర వాత మాట్లాడుతానని చెప్పినట్టు నవరామ్ నాయక్ తెలిపారు.

అర్ధరహితమైనవి కాదు అన్ని ఆధారాలతోనే ఆరోపణలు



కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

బీఆర్ఎస్ నాయకులపై తాము చేసిన ఆరోపణలు అన్ని అర్ధరహితమైనవి కాదని అన్ని ఆధారాలు ఉన్నవేని కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ బీఆర్ఎస్ నాయకులు అవినీతికి,అక్రమ వసూళ్లకు పాల్పడినట్లుగా తమవద్ద ఆధారాలు, సాక్ష్యాలు ఉన్నా యని, మేము చేసిన ఆరోపణలకు కట్టు బడి ఉన్నామన్నారు. అభివృద్ధి గురించి బీఆర్ఎస్ నాయకులు చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. తమ నాయకుడు మంత్రి శ్రీధర్‌బాబుకు పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి తెలిపిన విద్యావంతుడన్నారు. మండ లాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చూసే ఈ ప్రాంత ప్రజలు ఓట్లు వేసి గెలిపించినట్లుగా తెలిపారు. అభి వృద్ధి చేయని బిఆర్ఎస్ నాయు కుడుని ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. తాము మెప్పు కోసం పని చేయడం లేదని, ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నట్లుగా తెలిపారు.

నవతెలంగాణ
జనగామ
సోమవారం ఫిబ్రవరి 10, 2025 www.navatelangana.com

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక..

నవతెలంగాణ- స్టేషన్‌ఘన్‌పూర్



పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తదుపరి అందరి కలయికతో ప్రత్యేక సమ్మేళనం జరుపుకున్నారు. ఆదివారం స్థానిక సేయింట్ థామస్ పాఠశాలలో 2002 - 2003 సంవత్సరం 10వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈమేరకు పూర్వ ఉపాధ్యాయులు పి.సతీష్‌రెడ్డి, సంధ్య, పద్మ, కుర్షిదాలను ఆత్మీయ పిలుపుతో పలకరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేముల రవికృష్ణ, ఆకుల శ్రీధర్, శవ్వల రాజు, గట్టు రామక్రిష్ణ,రాపర్తి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా: కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం, దీంతో పాటు రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణ పైన ముందస్తుగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తామన్నారు.

అండర్ ప్రాస్ బ్రిడ్జి నిర్మాణంపై మంత్రి కోమటిరెడ్డి వెంటనే స్పందించాలి



దర్జీ సంఘం జిల్లా అధ్యక్షులు గాడి శివ

నవతెలంగాణ-జనగామ

బాణాపురం బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో రోడ్డు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించాలనిదర్జీ సంఘం జిల్లా అధ్యక్షులు గాడి శివ కోరారు. జనగామ పట్టణంలోని హైదరాబాద్ ఎన్‌హెచ్ బైపాస్ రోడ్డు మీద అండర్‌పాస్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 17 వ రోజు దర్జీ సంఘం జిల్లా అధ్యక్షులు గాడి శివ ప్రారంభించారు. ఈ దీక్షలో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, శాఖ కార్యదర్శి సిద్ధిరాల ఉపేందర్, భక్తుల కోటయ్య, బూర్డి సంపత్, కర్రి రేణుక, కోడూరి భవానిలు కూర్చున్నారు. ఈసందర్భంగా శివ మాట్లాడుతూ జనగాం పట్టణం నుండి బచ్చన్నపేట మండలం పెదరాంచర్ల గ్రామంతో పాటు అటువైపుగా వెళ్లే అనేక గ్రామాల ప్రజలు అండర్ క్రాస్ బ్రిడ్జి వేయకపోతే తీవ్ర అవస్థలు పడతారని తెలిపారు. ప్రతిరోజు వేలాదిగా ఈ దారి గుండా ప్రజలు వెళ్తారన్నారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించకపోతే హైవే పైన ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఈరోడ్డుపై వెళ్లే ప్రధానంగా పేద, దళిత, రైతులు అధిక శాతం ఉన్నారన్నారు. పేదలపై ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. ప్రజా సమస్యలను అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలన్నారు. ప్రధానంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈవిషయంపై స్పందించి అధికారులకు ఆదేశించాలన్నారు. లేకుంటే ఆయా రాజకీయ పార్టీలను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..!

- ఆలయ బకాయిదారులపై చర్యలేవి..?
- దేవాదాయ, రెవెన్యూ శాఖల సమన్వయ లోపం
- బకాయిదారులకు నోటీసులు జారీ చేయని వైనం
- 15 ఏళ్లలో రూ.54.16 లక్షల బకాయిలు సోమన్నకు శఠగోపం పెట్టేందుకు
- మొండికేస్తున్న బకాయిదారులు
- సమీక్షకు నెల రోజులు గడిచినా చర్యలు శూన్యం
- నేడు బ్రహ్మోత్సవాల నిర్వహణ పట్ల కో-ఆర్డినేషన్ సమావేశం

నవతెలంగాణ-పాలకుర్తి

సోమన్న ఆలయ బకాయిదారుల నుండి బకాయిలను వసూలు చేసేందుకు రెవెన్యూ చట్టాన్ని ఉపయోగిస్తూ నోటీసులు జారీ చేసి, ఆస్తులను జప్తు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు బేఖాతర్ చేశారు. పాలకుర్తి, వల్మిడి ఆలయాల అభివృద్ధితో పాటు పర్యాటక పనుల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలని జనవరి 8న పాలకుర్తి మండలం వల్మీడిలో గల శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లతోపాటు అధికారులు పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధిపై సుదీర్ఘంగా నిర్వహించిన సమీక్ష లో భాగంగా పాలకుర్తి ఆలయ బకాయిదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాలు జారీ చేశారు. బకాయి దారులు ఎంతటి వారినైనా వదిలేది లేదని, బకాయిల వసూళ్లకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించి ఆలయ బకాయిలను వసూలు చేసే విధంగా నోటీసులు అందించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశం జరిగి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఒక్క బకాయిదారునికి దేవాదాయ, రెవెన్యూ శాఖలు నోటీసులు జారీ చేయకపోవడం గమనార్హం. దేవాదాయ, రెవెన్యూ శాఖల సమన్వయ లోపం బకాయిదారులను పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ రికవరీ చట్టంతో బకాయిదారుల ఆస్తులను జప్తి చేయాలని, ఆలయాల్లో బకాయి దారులు ఎలాంటి వేలంలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్ట్‌లో బకాయిదారుల పేర్లను నమోదు చేయాలని సమీక్షలో నిర్ణయించారు. సమీక్ష నిర్ణయాలు నేటికీ అమలు కాకపోవడంతో ఆలయ బకాయిదారులు బకాయిలను చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.





ఆలయ బకాయిదారులే బినామీల పేరుతో సోమన్న ఆలయం వద్ద యధేచ్ఛగా పూజా సామాగ్రిని విక్రయిస్తూ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. 2008 నుండి 2022 వరకు 15 ఏళ్లలో రూ.54 లక్షల 16 వేల 505 బకాయిలు ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. సోమన్న ఆలయంలో టెండర్ల ద్వారా టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకునే హక్కుతో పాటు స్వామివారి ఫోటోలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆహ్వానించిన టెండర్లలో పాల్గొని హక్కులు సాధించుకున్నారని దేవాలయ శాఖ అధికారులు తెలిపారు. సోమన్న ఆలయ బకాయిదారుల్లో 2008-09లో దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన తాటిశెట్టి ఉపేందర్ రూ.1,70, 500, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలుకనూరు గ్రామానికి చెందిన పాసదము రాములు రూ.లక్ష , 2009-10లో మెదక్ జిల్లా వర్గల్ గ్రామం, మండలానికి చెందిన కాశీ ఓంకార్ రూ.1,25,500, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన తాళ్ల సోమనారాయణ రూ.40వేలు, 2011-12లో హనుమకొండకు చెందిన పొన్నం రణధీర్ రూ.లక్ష 30 వేలు, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన చిదురాల శంకర్ రూ.36 వేలు, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన జీడి సోమేశ్వర్ రూ.25,300, 2012-13 లో పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన కత్తి దస్తగిరి రూ.80, 105, పాలకుర్తి గ్రామం మండలానికి చెందిన పెద్దూరి సోమన్న రూ.7100, 2013-14 లో నల్లగొండ జిల్లా అర్వపల్లి గ్రామం, మండలానికి చెందిన పేరబోయిన వెంకటయ్య రూ.4 లక్షల 67వేలు, 2014-15లో పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన తాళ్ల అంజమ్మ రూ.లక్ష 45వేలు, 2015-16లో పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన పుట్ట ఉమ రూ.6 లక్షల 6వేలు, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన తాళ్ల సోమనారాయణ రూ.1, 40వేలు, పాలకుర్తి గ్రామం మండలానికి చెందిన నల్ల సుజాత రూ.41వేలు, 2016-17 లో హనుమకొండ జులైవాడకు చెందిన దాసరి నర్సయ్య రూ.9 లక్షల 80వేలు, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన పెనుగొండ ఆంజనేయులు రూ.3 లక్షల 11 వేలు, 2017-18లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన ఇల్లందుల హరీష్ రూ.10 లక్షల 85,500, పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన మన్నూరు రామ్మూర్తి రూ.లక్ష 6,500, 2018-19లో పాలకుర్తి గ్రామం, మండలానికి చెందిన గోనెల మురళి రూ.5 లక్షల 26 వేలు, 2021-22 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలం కొండేటి క్రూరు గ్రామానికి చెందిన వీరదుర్గ నాగ హ్యాగ్రీ రూ.లక్ష 36వేలు, 2022-23లో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామం, మండలానికి చెందిన కుక్కల వేమన రూ.1 లక్ష 58వేలు బకాయిలు ఉన్నారు. శివకేశవులకు నిలయంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి బకాయి దారుల నుండి బకాయిలు వసూలు చేసి ఆలయ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పలువురు కోరుచున్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం బకాయిదారుల నుండి బకాయిలను వసూలు చేసేందుకు దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన బాధ్యత ఉందని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

నేడు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కో-ఆర్డినేషన్ సమావేశం

ఈనెల 25 నుండి మార్చి 1వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేసేందుకు నేడు(సోమవారం) శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని కళ్యాణ మండపంలో కో-ఆర్డినేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఈవో సల్వాది మోహన్‌బాబు తెలిపారు. ఈసమావేశానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

దళిత కాలనీకి విద్యుత్ సరఫరా లేదా..!



- మూడు సంవత్సరాలుగా నరకయాతన అనుభవిస్తున్న కాలనీవాసులు..

నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

మండలంలోని మంచుప్పుల గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల దళిత కాలనీకి కరెంటు సౌకర్యం లేక మూడు సంవత్సరాలు అవుతుందని కాలనీవాసులు అంటున్నారు. ఎన్నిసార్లు విద్యుత్‌శాఖ వారిని సంప్రదించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కరెంటు సౌకర్యం లేకపోవడంతో ఇళ్లల్లో పాములు, తేళ్లతో నిత్యం సావాసం చేసినట్లు అవుతుందని తెలిపారు. సరైన వెలుతురు సౌకర్యం లేకపోవడం వల్ల చదువుకునే పిల్లలు కూడా అవస్థలు పడుతున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం నుండి నేటి వరకు ఎంతమంది అధికారుల చుట్టూ తిరుగుతూ ఉన్ననూ ఫలితం లేదని అంటున్నారు.

మాకాలనీకి విద్యుత్ లైన్ ఇవ్వాలి



గత మూడు సంవత్సరాలుగా మా కాలనీ చీకట్లోనే మగ్గుతుంది. మాజీ ప్రజా ప్రతినిధి మా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీకి కరెంటు రాకుండా లైను తీయించాడు. విద్యుత్‌శాఖ వారిని ఎన్నిసార్లు సంప్రదించినా స్పందన కరువైంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి మా కాలనీకి విద్యుత్ లైన్ ఇవ్వాలి.

కాకర్ల ప్రవీణ్ , శాఖ కార్యదర్శి మంచిప్పుల

ఎన్నికల ముందు ఇచ్చిన మాట తప్పారు..



గత పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు కరెంటు ఇస్తామని చెప్పిన మాట తప్పినారు. ఎన్ని సార్లు ప్రజాప్రతినిధులకు. అధికారులకు మా ఇండ్లకు కరెంటు లేదని గోడు విన్నవించిననూ పట్టించుకోవడం లేదు.

పడమటింటి సోమక్క, డబుల్ బెడ్ రూం ఇండ్ల నివాసితురాలు

సత్యం, ఏఈ. రూరల్(విద్యుత్‌శాఖ) పాలకుర్తిని సంప్రదించగా నిర్లక్ష్యంతో మొన్ననే కాలనీకి కరెంటు కనెక్షన్ ఇచ్చాం తెలుసుకోండని సమాధానం ఇచ్చారు.



గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రఘునాథ్ గౌడ్ ఎన్నిక

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ జనగామ మండలం పెంబర్తి గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంబాల రఘునాథ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన గ్రామ శాఖ పార్టీ కార్యకర్తల సమావేశంలో రఘునాథ్‌తో పాటు ఆత్మకూరు స్వామి, ఎంబరి హనుమంతరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసమావేశంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంద్రు సిద్దులు, మాజీ సర్పంచ్ అంబాల అంజనేయులు గౌడ్, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గోదల వంశీధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సంకటి యాదగిరి, మాజీ వార్డు సభ్యులు గొలుసుల దుర్గాచలం (గద్దర్), ఇబ్రహీం, సంకటి రాజు, అంబాల శ్రీనివాస్ గౌడ్, ఆలకుంట్ల కొమురయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భానుచందర్, మల్లేష్, మహేందర్, గోనెల సమ్మయ్య, సోషల్ మీడియా కన్వీనర్ బుర్రి కరుణాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల చిత్ర పటాలకు క్షీరాభిషేకం



నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని సిరిపురం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జనగామ నుండి వయా కళ్లెం, సిరిపురం జీడికల్ వరకు బీటీ రోడ్డు కొరకు ఎంఆర్ఆర్ ద్వారా రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఎంగాలి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు బసవగాని అనిల్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిటకోరు సంపత్, జీడికల్ దేవస్థానం డైరెక్టర్ బస్వగాని నరేష్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉపేందర్‌గౌడ్, గ్రామ సీనియర్ నాయకులు కీసర రంగారెడ్డి, బొమ్మెర్ల మల్లేష్ , చిటకోరు సంజీవులు , బర్ల అంజయ్య, మర్రి భాస్కర్ రెడ్డి, బంద్రు బీరయ్య , బొమ్మెర్ల యాదగిరి, వేముల కృష్ణారెడ్డి, మీసాల కృష్ణ బండ అంజయ్య, సందేనా పోషయ్య, కొత్త స్వామి, దయ స్వామి, దుర్గి అంజయ్య, కోరిపెల్లి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు బర్ల కిషోర్, శుభాష్ పప్పుల కౌశిక్, బస్వగాని శ్రీకాంత్‌గౌడ్, ఎలా బాలస్వామి, బందేలా చింటూ, సందేనా చందు, కొత్త వినోద్, బోడిగే అవినాష్ గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ డీఈవో రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు ఇప్ప రామ్‌రెడ్డి

నవతెలంగాణ-జనగామ

ఆర్‌టీఐ క్రింద సమాచారం ఇవ్వని జిల్లా విద్యా అధికారి కార్యాలయం ఏడీ ఇన్‌ఛార్జ్ డీఈవో రమేష్ పై చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇప్పరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టీఐ సమాచారం విషయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఖాతర్ చేయడం లేదన్నారు. సమాచారహక్కు చట్టం క్రింద సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి సారి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిగా నున్న ఏడి రమేష్ దరఖాస్తు ముట్టలేదని అబద్ధలాడుతున్నారని ఆరోపించారు. దరఖాస్తు దారుడు దరఖాస్తు ముట్టినట్లు ఆధారాలు చూపెడితే అసంపూర్తి సమాచారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు.ఈ మధ్య ఒక ఉద్యోగి సెలవులకు సంబంధించిన సమాచారం కోరుతూ దరఖాస్తు పెట్టి 3 నెలలు గడిచినా సమాచారం ఇవ్వడం లేదన్నారు. సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏడీ రమేష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అయన డిమాండ్ చేశారు.

ఘనంగా.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

నవతెలంగాణ-బచ్చన్నపేట



బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డి పల్లి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1999-2000 బ్యాచ్ విద్యార్థులు 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరు ఒకే వేదికపై కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం దివంగతులైన ఉపాధ్యాయులు, తోటి స్నేహితుల ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. జ్యోతిని వెలిగించి సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రారంభించారు. ఆనాటి గురువులు సుధాకర్, రఘునందన్‌రెడ్డి, ఆనంద్ కుమార్, మహేందర్, రవి కుమార్, మహేందర్, హరిప్రసాద్, ప్రేమసుందర్‌రెడ్డి, సోములు, చంద్రారెడ్డిలను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. విద్యార్థుల ఆట పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో కాపర్తి సురేందర్, శ్రీహరి, కోటీశ్వర్‌రెడ్డి, ప్రకాష్, రాజమౌళి, అంబాదాస్, అంజయ్య, దుర్గాప్రసాద్, సంతోష్, రమేష్ రెడ్డి, శోభ, అన్నపూర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-జఫర్‌గడ్



మండల కేంద్రానికి చెందిన మొగిలి పాక మల్లేశం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పదవ తరగతి కలిసి చదువుకున్న తోటి మిత్రులు, ఆదివారం మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి 1997-98 బ్యాచ్ కి చెందిన మల్లేశం తో కలిసి చదువుకున్న తోటి మిత్రులు చిన్నతనంలోనే కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోవడంతో స్నేహితులందరూ కలిసి వారి కుటుంబాన్ని ఆసరాగా ఉండాలని భావించి బ్యాచ్ తరుపున రూ.31000 అందజేశారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మాయిలపై అరాచకం సహించరాని నేరం

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభిగౌడ్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామలోని వైష్ణవి ఉన్నత పాఠశాలలో ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్న డీన్ శివ కుమార్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడం సహించరాని నేరమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభిగౌడ్ అన్నారు. ఈవిషయమై విద్యార్థినుల నుండి తల్లిదండ్రుల నుండి సమాచారం అందగానే ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి పాఠశాలకు వెళ్లి నిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా నివ్వెరపోయే నిజాలు తెలిసాయి. క్లాస్ రూమ్‌లో ఉన్న అమ్మాయిలందరు అదే సమస్యను ఎదుర్కోవడం అందరిని ఆశ్చర్య పరిచింది. విద్యార్థుల జీవితాలని కాపాడి తగిన మంచి మార్గంలో నడపాల్సిన వ్యక్తి అదే విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించడం చాలా నీచంగా ఉందని, ఇందుకు శ్రీచైతన్య విద్యా వ్యవస్థ వారికి వత్తాసు పలుకుతూ అప్పటికప్పుడు విషయం నుండి తప్పించుకోవడానికి దానికి బాధ్యులు అయిన డీన్, ఏజీఎం లనను సస్పెండ్ చేస్తున్నామని చెప్పి చేతులు దులుపుకోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభత్వం ఎంత కఠినంగా ఉన్న ఇలాంటి వారిని మనమే అడ్డుకొని తగిన శాస్తి చేసి కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు మన పిల్లలని పంపకుండా వాటిని మూసి వేసేలా చేసి బుద్ధి చెప్పాలన్నారు.ఈకార్యకమంలో వివిధ విద్యార్థి సంఘాలతో పాటు నాయకులు కార్తీక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ శాఖ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-బచ్చన్నపేట



డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి సూచనలతో గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో పడమటి కేశవాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని గ్రామ శాఖ అధ్యక్షులు సంతోష్ రెడ్డి వెల్లడించారు. ఈకార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్, మాజీ సర్పంచ్ గిద్దల రమేష్ సీనియర్ నాయకులు బంధువుల శ్రీనివాస్‌గౌడ్ .అబ్బాస్. ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, ఉపాధ్యక్షులు సుండు రవి, ఎర్రోళ్ల శివ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాగిత గణేష్. నాయకులు జంగిటి రమేష్. కొమ్ము శ్రీధర్. బైనా ఆంజనేయులు. వడాల మధు. నిమ్మ కరుణాకర్‌రెడ్డి. కాగిత వినయ్, బండారి భాస్కర్, ఆరుకొండ విజయ్‌కాంత్, ఆరుగొండ సాయిరాం. వంద మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి అరకిలో వెండి పూర్ణకుంభం బహుకరణ

నవతెలంగాణ-పాలకుర్తి



శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హనుమకొండకు చెందిన వేముల వీరభద్రం కళ్యాణి దంపతులతో పాటు దీక్షిత్, హర్షిని లు ఆదివారం అర కిలో వెండి పూర్ణకుంభాన్ని బహుకరించారు. ఆలయ ముఖ్య అర్చకులు మత్తగజం నాగరాజు సమక్షంలో వెండి పూర్ణకుంభాన్ని బహుకరించామని వీరభద్రం తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు, ఆలయ సూపరింటెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రయ్య మరణం పార్టీకి తీరని లోటు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తిరూరల్:



పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బెల్లి ఎర్రయ్య(80) మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఎర్రయ్య మృతి చెందగా ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వారి భౌతికాయంపై ఎర్రజెండా కప్పి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కనకా రెడ్డి మాట్లాడుతూ ఎర్రయ్య మరణించడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎర్రయ్య ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఎన్ని రాజకీయ పరిణామాలు జరిగిన నమ్మిన ఆశయం కోసం పనిచేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. రైతాంగ, కార్మికుల ,అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పనిచే శారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు అయ్యేంత వరకు అమరవీరుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని పోరాటాలు నిర్వహించ వలసిన ఆవశ్యకత ఎంతైనా పార్టీశ్రేణులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మాదార్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు జ్యోతి ఉపేందర్, గ్రామ నాయకులు బెల్లి సంపత్, పనికిరా రాజు, పనికిరా భాస్కర్, నాయిని శ్రీను, యాధనాల చిరంజీవి, టి.నరసయ్య, పద్మ, శ్రీలత, సోమలక్ష్మి, బి.విజయ, బి.నరసయ్య, బి.వెంకన్నలతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గట్టమ్మ కుటుంబానికి సీపీఐ(ఎం) పరామర్శ..

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్:



మండలంలోని ఇరవెన్ను గ్రామంలో గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో జక్కుల ఘట్టమ్మ మృతిచెందగా సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి గట్టమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి పార్టీ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, గ్రామ నాయకులు జక్కుల రాజు, కొలగంటి బుచ్చయ్య, జక్కుల సోమన్న, కొంతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ అధ్యక్షుల సన్నాహక సమావేశం..

నవతెలంగాణ-బచ్చన్నపేట

బచన్నపేట మండల వివిధ గ్రామ శాఖ యూత్ అధ్యక్షులతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా బచన్నపేట మండల అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎద్దు హరీష్‌లు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి యూత్ నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకత్వం అంటే పదవులు కాదు, బాధ్యతలు అని గుర్తు చేస్తూ, ప్రతి కార్యకర్త పార్టీ కోసం పనిచేసే విధంగా సత్సంకల్పంతో ముందుకు వెళ్లాలని కోరారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అందరి సమస్యలను పార్టీ స్థాయి నుంచి ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

తాపీ మేస్త్రిల్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నవతెలంగాణ-తొర్రూర్

తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడిగా తనను గెలిపిస్తే కార్మికుల సమస్యల పరిషారానికై శక్తివంచన లేకుండా అహర్నిశలు కృషి చేస్తానని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థి మర్క సాంబయ్య అన్నారు. ఆదివారం తొర్రూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్మాణం చేసే పెద్ద పెద్ద భవనాల కాంట్రాక్ట్ పనులను సివిల్ కాంట్రాక్టర్లకు అప్పజెప్పకుండా తాపీ మేస్త్రీలుగా కొనసాగుతున్న వారికే లైసెన్సులు ఇచ్చి వారితోనే పని చేయించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టి, తాపీ మేస్త్రీల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటు నందించాలన్నారు.. సోమవారం నిర్వహించే తొర్రూరు మండలం తాపీ మేస్త్రీల సంఘం ఎన్నికలలో మీ అమూల్యమైన ఓటు నాకు వేసి గెలిపించాలని తాపీ మేస్త్రి లను కోరారు.

ఘనంగా.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-బయ్యారం:

పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ఆదివారం వేదికగా మారింది. చిన్నతనంలో ఆడి పాడిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పదవ తరగతి 1999 - 2000 పూర్వపు విద్యార్థులు అందరూ ఒకచోట కలుసుకొని ఆనందంగా గడిపారు. విద్యను నేర్పించిన గురువులను తొలుత ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలిసిన వారందరూ వయసు హోదాను మరచి రారా పోరా అంటూ పగలంతా ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణను అందరూ కలిసి నిర్ణయించుకున్నారు.

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం ..



● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్

నవతెలంగాణ-మరిపెడ

కల్లుగీత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మరిపెడలో శ్రీకంఠమహేశ్వరస్వామివారి వేడుకలో ఆయన పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా గౌడ కులస్తులు మర్యాదపూర్వకంగా రాంచంద్రునాయక్ ను ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ కుల గణన పూర్తిచేసిన ఘనత ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక సీట్లకు రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎస్.కె తాజోద్దీన్, నాయకులు కాలం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, పట్టణ నాయకులు వి.శ్రీపాల్ రెడ్డి, గుండ గాని వెంకన్న అలువాల ఉపేందర్, గంధసిరి భిక్షపతి, భాషిపాంగు రవి కిరణ్, బోడ రమేష్, పరశురాములు, తదితరులు ఉన్నారు.

బీసీలకు ఆకాశం వస్తే మాగ్రామానికి జడ్పీటీసీ టికెట్ ఇవ్వాలి

● ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించుకున్న బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామ కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-నెల్లికుదురు

నెల్లికుదురు మండల జడ్పీటీసీగా బీసీ రిజర్వేషన్ వస్తే బ్రాహ్మణ కొత్తపెల్లి గ్రామ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని మహబూబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను కోరినట్లు ఆగ్రామ కాంగ్రెస్ నేతలు మాజీ వైస్ ఎంపీపీ జిల్లా వెంకటేష్, మాజీ సర్పంచ్ పెరుమాళ్ళ మల్లేషం, పెరుమాండ్ల శంకర్‌లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ సహకారంతో నియోజక వర్గాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి, మండల అభివృద్ధికి మాసహకారం ఉంటుందని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో నెల్లికుదురు మండల జడ్పీటీసీగా బీసీ రిజర్వేషన్ అయితే కచ్చితంగా మాబ్రాహ్మణ కొత్తపల్లి గ్రామ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పెరుమాళ్ళ రాజుగౌడ్, తాళ్ళ చిన్న ప్రభాకర్ గౌడ్ చిన్న బోయిన శ్రీనివాస్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-బయ్యారం:

మండల పరిధిలోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ తల్లి పునర్నినిర్మాణానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పెద్ద చెరువు కట్టపై కట్ట మైసమ్మ తల్లి గుడిని గతంలో కొందరు గుప్త నిధులు ఉన్నాయనే కారణంతో కట్ట మైసమ్మ గుడిని కొందరు దొంగలు కట్ట మైసమ్మ గుడి ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేయడంతో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బయ్యారం పెద్ద చెరువు కట్టమీద ధ్వంసమైన అమ్మవారి గుడి ప్రాంతాన్ని పరిశీలించి, అమ్మవారిని మరల పున:ప్రతిష్ట చేయడానికి అయ్యే ఖర్చంతా తానే భరిస్తానని చెప్పడం జరిగింది. బయ్యారం పెద్ద చెరువుకు, చెరువు కట్టకు, బయ్యారం పెద్ద చెరువు నీటిపారకం గల గ్రామాలకు ఏమైనా అరిష్టం జరుగుతుందని భావించి నష్ట నివారణ చర్యలు చేయాలనే భావనతో ధ్వంసం అయినటువంటి కట్ట మైసమ్మ గుడిని మళ్లీ పునర్నిర్మాణం చేయడం కోసం ఎమ్మెల్యే ఆదేశానుసారం మండలంలోని పెద్ద చెరువు పరిధిలో గల సమీప గ్రామాల ప్రజలు, నీటి పారకం గల రైతులు, సమీప గ్రామాల కులపెద్దలు, వివిధ పార్టీల నాయకులు అందరూ పెద్ద చెరువు కట్టపై సమావేశం ఏర్పాటు చేసుకొని అమ్మవారి మూలవిరాట్ కు సంబంధించిన పూజారులను పిలిపించి మంచి, చెడులను చర్చించి అందరి ఏకాభిప్రాయంతో స్థల పరిశీలన చేసి, అమ్మవారి గుడి పునర్నిర్మాణం కోసం వచ్చినటువంటి పూజారులతో మంచి ముహూర్తం ఈనెల 21వ తేదీన గుడి పనులు ప్రారంభించుటకు తేదీని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, భూక్య ప్రవీణ్ నాయక్, బండారి ఐలయ్య, వేల్పుల శ్రీనివాస్, రాసమల్ల నాగేశ్వరావు, పగడాల శ్రీను, బాబా, పోతుగంటి సుమన్, వీరబోయిన భూషయ్య, నాగేశ్వర రావు, ఏనుగుల రాకేష్, బరిగెల ఉపేందర్, బొమ్మకంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు ఎక్స్‌ప్రెస్ నిలుపుదలను కొనసాగించాలి

నవతెలంగాణ-గార్ల:

గార్ల రైల్వేస్టేషన్‌లో గత రెండు సంవత్సరాలుగా మణుగూరు ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేస్తున్నారని, ఆ నిలుపుదలను యధావిధిగా కొనసాగించే విధంగా కృషి చేయాలని ఖమ్మం ఎంపీ వద్దిరాజ్ రవిచంద్రకు హైదరాబాదులో స్థానిక టిఆర్ఎస్ నేతలు ఆదివారం వినతి పత్రాన్ని ని అందజేశారు. మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు గార్ల రైల్వే స్టేషన్‌లో లో నిలుపుదల చేయకుంటే మణుగూరు, కొత్తగూడెం, భద్రాచలం, వరంగల్, ఖాజీపేట, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు, వ్యాపారస్తులు, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు పానుగంటి రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, నాయకులు, బూడిగ మురళీ గౌడ్ తదితరులు ఉన్నారు.



రోజా కుటుంబానికి విప్ పరామర్శ..

నవతెలంగాణ- మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల సపావట్ తండాలో రోజా కుటుంబాన్ని ఆదివారం ప్రభుత్వ విప్, డాక్టర్ జాటోతు రామచంద్రునాయక్ పరామర్శించారు. ఇటీవల కాలంలో సిరోలు ఏకలవ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా నృత్యం చేస్తూ మృతి చెందిన విషయం తెలిసిందే, కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని రామచంద్రునాయక్ వారికి భరోసా కల్పించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూకే సాధ్యం

నవతెలంగాణ-నెల్లికుదురు



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే అది పీఆంˆటీయూతోనే సాధ్య మని పీఆర్ టీయూ మండల అధ్యక్షుడు కార్యదర్శి కొత్త నరసంహారెడ్డి, గొట్టిముక్కుల శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగరవేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలంపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలు ఎన్నో వాటిని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించిన ఘనత పీఆర్‌టీయూదేనన్నారు. అనంతరం సీనియర్ పీఆర్‌టీయూ లీడర పీడీ గొట్టిముక్కుల రాఖీ రెడ్డికి బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. మన ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించి శాసనమండలికి పంపించి ఉపాధ్యాయుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు లక్ష్మణ్, ఫణీంద్ర, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ఉపాధి హామీలో కొనసాగుతున్న అవినీతి..!

● మొక్కల పేరుతో లక్షల రూపాయలు స్వాహా..
● కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి దారి మళ్లించిన ఫీల్డ్ అసిస్టెంట్
● విచారణ పేరుతో అధికారుల కాలయాపన





నవతెలంగాణ-మరిపెడ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో అవినీతి పరంపర కొనసాగుతుంది. గ్రామాలలో సామాజిక తనిఖీ బృందాలు పర్యటించి అవినీతి వెలికి తీసినా పూర్తి వివరాలు బయటికి రాకుండా అధికారులు కాలయాపన చేయడంపై ఉపాధి కూలీలు అధికారుల తీరుపై మండి పడుతున్నారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలంలో 44 గ్రామాల ప్రజలు 2023-2024 ఆర్థిక సంవత్సరంలో పనులు చేయటానికి రూ:5,93,57,772 నిధులను కేటాయించారు. ఇందులో మండలంలోని నీలుకుర్తి గ్రామంలో సుమారు రూ.27లక్షల 23 వేల విలువగల పనులు జరుగగా ఇందులో రూ.8 లక్షల 40వేల అవినీతి జరిగినట్లు గ్రామ సామాజిక తనిఖీ బృందం సర్వేలో బయటపడింది. ఈగ్రామంలో 7825 మొక్కలు నాటక కేవలం 200 మొక్కలు బతికినట్లు తేల్చారు. సుమారు 60 మంది పేరుతో ఫోర్జరీ సంతకాలు పెట్టి అట్టి డబ్బులను కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ దారి మళ్లించినట్లు గ్రామస్తులు సమాచార హక్కు చట్ట ప్రకారంగా రికార్డులను వెలికి తీశారు. ఇందులో 27 మంది లబ్దిదారుల సంతకాలను ఫోర్జరీ చేసి డబ్బులు డ్రా చేసినట్లు అవినీతి బయటికి వచ్చిందని ఆర్టీఏ ద్వారా బట్టబయలు అయిందని ఆరోపించారు.

పనిచేయని వారి ఖాతాల్లోకి దారి మళ్లింపు

మండలంలోని నీలికుర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉప్పలయ్య భార్య మినహా మిగతావారు ఎవరు పనికి వెళ్లరు. భార్యకు వంద రోజులు పూర్తి కావడంతో పనిచేయడానికి అవకాశాలు లేకుండా పోయాయి. ఇద్దరు బిడ్డలకు పెండ్లిలై అత్తారింటికి వెళ్లిన వారికి ఏ ఊరులోనే జాబ్ కార్డు మంజూరు చేసి వారి పేరుతో డబ్బులను దుర్వినియోగం చేశారు. ఆకుల ఉష పేరుతో రూ:44,849, ఆకుల సౌజన్య, ఆకుల మల్లికార్జున్‌ల పేర్లతో రూ 92,785, . ఆకుల రాజ్యలక్ష్మి పేరుతో రూ:50,659లు డ్రా చేసినట్లు ఆర్టీఏ ద్వారా గ్రామస్తులు వెలికి తీశారు. ఈ గ్రామంలో జరిగిన అవినీతికి టెక్నికల్ అసిస్టెంట్- ఏపీఓ లకు కూడా సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైనదని గ్రామస్తులు విమర్శించారు. రూ.ఎనిమిది లక్షల 40 వేలు అవినీతి జరిగితే కేవలం రూ.1,21,241 లకు రికవరీకి ఆదేశించడం గమనార్హం.

● ఐదు సంవత్సరాలు పనిచేసినా ఒక్క రూపాయి రాలేదు..



నీలికుర్తి గ్రామంలో గత ఐదు సంవత్సరాలుగా మొక్కల పెంపకం నర్సరీలో పనిచేస్తున్నా ఒక్క రూపాయి కూడా తీసు కోలేదని, నా డబ్బులు ఇవ్వాలని అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడిగినా పట్టించు కోలేదని తెలిపారు. అట్టి డబ్బులను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి దారి మళ్ళించారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నాకు రూ.6 లక్షల 50 వేలు రావాల్సి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

ఉపాధి కూలీ, ఆదిముల్లా ఉపేంద్ర

● పనిచేయని వారికి డబ్బులు చెల్లింపు..!



నీలికుర్తి గ్రామంలో జరుగుతున్న పనులు ఎంతోమంది పేదలకు ఆసరాగా నిలిచేదని, గత సంవత్సరం నుండి పనిచేస్తున్న డబ్బులు రావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగినా సమాధానం చెప్పకుండా దాటివేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనిఖీ బృందం వచ్చి సర్వే చేయక మా గ్రామంలో జరిగిన అవినీతి బయటకు వచ్చిందని తెలిపారు. నిరుపేదల సొమ్మును కాజేసిన ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్య తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధి కూలీ: గాదేగాని సత్తయ్య

● ఉపాధి పథకానికి తూట్లు



వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టాలు కావాలని గత వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీలు పోరాడుతూ వారి కోసం ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. 2005 యూపీఏ ప్రభుత్వంలో ఆనాటి పార్లమెంట్‌లో 70 స్థానాలు గెలిచిన వామపక్ష ఎంపీలు మంత్రి పదవులు తీసుకోకుండా కనీసం ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఉపాధి చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేయడంతో ఆ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దీంతో దేశంలో ఉన్న కోట్లాదిమంది ప్రజలకు ఉపాధి దొరికే విధంగా అవకాశం ఉందని భావించామన్నారు. ఈ పథకానికి ప్రభుత్వాలు నిధులు కోత విధిస్తుండగా, వచ్చిన నిధులను కూలీలకు ఖర్చు చేయకుండా పనులు చేయకుండానే అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేయడం సిగ్గుచేటన్నారు. ఈపథకం ఉన్నతమైన ఆశయం కోసం వచ్చిందని దానికి తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అవినీతి జరిగిన చోట విచారణ కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోట్లల్లో అవినీతి జరిగితే రూ.లక్షలలో రికవరీకి ఆదేశించడంలో అధికారులు ఆదేశించడంలో అంతర్యం ఏమిటో తేలాలన్నారు. నీలికుర్తి, ఎల్లంపేట, తాళ్లఊకల్ తదితర గ్రామాలలో జరిగిన అవినీతిపై మరోసారి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, బాణాల రాజన్న

● ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటనే తొలగించాలి



మండలంలోని నీలికుర్తి గ్రామంలో రూ.27 లక్షల 23 వేల పనులు జరుగగా ఇందులో రూ:8 లక్షల 40 వేలు అవినీతి జరి గిందని, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవో సహకారంతో స్థా నిక ఫీల్డ్ అసి స్టెంట్ ఉప్పలయ్య అవినీతికి పాల్ప డినట్లు ఆరో పిం చారు. సామాజిక తనిఖీ బృందం అవి నీతి వెలికి తీసినా మండల స్థాయి అధికారులు కేవలం రూ.1 లక్ష 21 వేలు మాత్రమే రికవరీకి ఆదేశించారని అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ కమిటీని గ్రామాలకు పంపించి విచారణ జరిపించాలని ఆయన అధికారులను కోరారు. లేనియెడల రాష్ట్రస్థాయిలో అవినీతికి వ్యతిరేకంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ఆందోళన చేపడు తామని హెచ్చరించారు.

సీపీఐ, మండల కార్యదర్శి, మారగాని బాలకృష్ణ

విక్రయాలపై నిఘా ఏదీ..?

● రోడ్లపైనే మేకలు వధిస్తూ విక్రయాలు
● వైద్య పరీక్షలు లేకుండానే అమ్మకాలు
● పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-తొర్రూరు



డివిజన్ కేంద్రమైన తొర్రూరు పట్టణంతోపాటు మండలంలోని అనేక గ్రామాలలో మాంసం విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు ప్రతి ఆది, బుధవారాల్లో తమ ఇల్లు, మురుగు కాలువల సమీపంలో, రోడ్ల పక్కన వధించి మాంసాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించకుండానే రోగాల బారిన పడ్డ మేకలను కోస్తూ విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బహిరంగంగా దుమ్ము, ధూళి, ఈగలు, దోమలు వాలుతున్న మటన్‌ను(మాంసాన్ని) అమ్మకానికి పెడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులు మాంసం రూపంలో రోగాలు కొని తెచ్చుకుంటున్నారు.

● నిబంధనలు గాలికి..

మాంసం విక్రయాల కోసం మండల కేంద్రంలో మోడల్ మార్కెట్ ఏర్పాటు చేశారు. కోయడానికి సిద్ధం చేసిన మేకలను పశు వైద్యాధికారితో పరీక్ష చేయిస్తే స్టాంపు వేస్తారు. స్లాటర్ హౌస్ వద్దనే వాటిని కోసి అమ్మకాలు చేయాలి. వెటర్నరీ, మున్సిపల్ శాఖల ఆమోద ముద్ర ఉండాలి. వ్యాపారం చేయడానికి లైసెన్స్ కలిగి ఉండాలి. కాని చాలా సందర్భాల్లో రోగాల బారి న పడిన గొర్రెలు, మేకలు ఇష్టారాజ్యంగా కోస్తూ అమ్ముడుపోక మిగిలిన మాంసాన్ని మరుసటి రోజు అమ్ముతూ వ్యాపారం చేయడంతో కొనుగోలు చేసిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. పలువురు అనుమతులు లేకుండా గొర్రెలు, మేకలను వధించి విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని మాంసం విక్రయ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తొర్రూరు మున్సిపల్ పరిధిలో బస్టాండ్, కూరగాయల మార్కెట్, మేయిన్ రోడ్డుపై, పలు గ్రామాలలో విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఏమాత్రం నిబంధనలు అమలు కావడం లేదు.

● స్వచ్ఛ సర్వేక్షన్‌తో గాడిన పడేనా.

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు ప్రారంభించింది. మున్సిపాలిటీల్లో, మేజర్ గ్రామపంచాయతీల్లో ఆధునిక కబేలాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జంతు వధకే పరిమితం కాకుండా రక్తం, మాంసం, వ్యర్థాలను సాంకేతికతను వినియోగించి శాస్త్రీయ విధానాల్లో రీసైక్లింగ్ చేసేలా దీన్ని రూపొందించాలని నిబంధనలు ఉన్నాయి. కానీ ఏ ఒక్కచోట కూడా ఆధునిక కబేలాల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో పలుచోట్ల విచ్చలవిడిగా మాంసం విక్రయాలు పెరిగాయి. మాంసం విక్రయదారులు తప్పనిసరిగా జీవాల ఆరోగ్యం పై పశు వైద్యులతో పరీక్ష చేసిన అనంతరమే వధించాలని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● నిబంధనలు ఇవీ..

గొర్రె, మేకలు, ఇతర జీవాలను వధించే ముందు ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి ధ్రువీకరించాలి. 8 నెలల వయసు దాటినవి మాత్రమే వినియోగించాలి. జంతు ప్రదేశాలల్లో వధించి శుభ్రం చేసిన మాంసం విక్రయించాలి. కోసిన తర్వాత మళ్లీ పశువైద్యా శాఖ అధికారులు మాంసం పై ముద్ర వేయాలి.

ట్రీట్‌మెంట్ వరకే మా బాధ్యత..



గొర్రెలు, మేకలను ట్రీట్‌మెంట్ చేయడం వరకే మా బాధ్యత అని, మాంసం విక్రయాలకు కోసే జంతువుల వైద్య పరీక్షలకు మాకు సంబంధం లేదు. మేము వైద్య పరీక్షలు చేయకూడదు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పశువైద్యా ధికారిని నియమిస్తారు. ఆ వైద్యాధికారి మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించాలి.

ఎస్.మాధవి, పశువైద్యాధికారి తొర్రూర్

రోడ్ల పక్కన మాంసం విక్రయించరాదు..



తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయాలను రోడ్ల పక్కన నిర్వహించరాదు. మున్సిపాలిటీకి ప్రత్యేక పశు వైద్యాధికారి లేదు. పట్టణంలో 15 మాంసం విక్రయ దుకాణాలు ఉన్నాయి. వీరిలో రెగ్యులర్‌గా అమ్మే నలుగురు మాత్రమే లైసెన్స్ పొందారు. మిగతావారు కేవలం ఆదివారం మాత్రమే అమ్ముతున్నారు. స్లాటర్ హౌస్ నిర్మించాల్సి ఉంది. నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి. మోడల్ మార్కెట్ పై అంతస్తులో మాంసం విక్రయాలకు కేటాయించారు. ఇకపై రోడ్లమీద అమ్మితే చర్యలు తప్పవు.

పి.శాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్ తొర్రూర్

రియల్' రివర్స్.. !

● భారీగా పడిపోయిన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు



నవతెలంగాణ- తొర్రూర్‌రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నేల చూపులు చూస్తోంది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు దారుణంగా పడిపోయాయి. అమ్మకాలు, కొనుగోళ్ల లావాదేవీలతో కిటకిటలాడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద అసలు సందడే కనిపించడంలేదు. గత ఏడాది నుంచి రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో ఆశాఖ ఆదాయం భారీగా తగ్గిపోయింది. గత సంవత్సరం వచ్చినంత ఆదాయం ఈసారి వచ్చే పరిస్థితి లేదని ఉన్నతాధికారులు పెదవి విరుస్తున్నారు.

2023-24లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు జరుగగా అంతకుముందు రెండేళ్లు కూడా రిజిస్ట్రేషన్ల సంఖ్య 26 లక్షలకుపైనే ఉంది. ఈ ఏడాది కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లు అంతంత మాత్రమే. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇక నెల సమయం మాత్రమే మిగిలింది. కనీసం గతేడాది తరహాలో రిజిస్ట్రేషన్లు జరగాలన్నా సుమారు మరో 10 లక్షల రిజిస్ట్రేషన్లు జరగాలి. మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు గమనిస్తుంటే అది కష్టమేనని చెబుతున్నారు. సాధారణంగా ఏటా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతుంది. ఈదఫా అదనంగా పెరగకపోగా గతంలో ఉన్న సంఖ్యను కూడా చేరుకునే అవకాశం కనిపించడంలేదు.

ప్రధాన కేంద్రాల్లో నిరాశే...

ప్రధాన కేంద్రాలైన తొర్రూర్, మహబూబాబాద్, మరిపెడ లాంటి ప్రధాన కేంద్రాల్లో భూమి మార్కెట్ డిమాండ్ రాక కొనుగోలుదారులు ముందుకు రాక రియల్ ఎస్టేట్ రంగం తగ్గిపోయింది.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఇనుగుర్తి

ఎస్సీ వర్గీకరణ అనేది ముప్పై యేండ్ల కల అని, ఆ కలను సహకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహంకాళి రాము అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహంకాళి రాము ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురెల్లి సతీష్, దేవులపల్లి వెంకన్న, గుజ్జునూరి బాబురావు, మలిశెట్టి శ్యామ్, కొట్టం రాము, తమ్మడపల్లి యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
సోమవారం | ఫిబ్రవరి 10 2025 | www.navatelangana.com

అనాథ పిల్లలకు అండగా నిలవాలి

బాలవికాస ప్రోగ్రామ్ మేనేజర్ లతా ప్రతాప్

నవతెలంగాణ-తొర్రూరు

అనాథ పిల్లల అభ్యున్నతికి సమాజం అండగా నిలవాలని బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ లతా ప్రతాప్ కోరారు. జన వికాస ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో అనాథ పిల్లల జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం అనాథ పిల్లలకు దాతల సహకారంతో నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా లతా ప్రతాప్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఆపన్న హస్తం అందించాలని, వారు సమాజంలో గౌరవంగా బ్రతికేలా చేయూత అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధులు వై.రమ, ఎం.రమ, శైలజ, శోభ, సరిత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



జనగామ



స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు సత్తా చాటాలి

నవతెలంగాణ-పాలకుర్తి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు సత్తా చాటేందుకు ఐక్యంగా ఉండాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్ కురుమలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విసునూరు మాజీ సర్పంచ్ నకిర్త యాకయ్య అధ్యక్షతన జరిగిన కురుమ సంఘం మండల స్థాయి సమావేశానికి కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు చేవెళ్లి మధుసూదన్ కలిసి మల్లేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో, ప్రాదేశిక ఎన్నికల్లో కురుమలు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, మెజారిటీ స్థానాల్లో పోటీ చేయాలని సూచించారు.

కురుమ సంఘం మండల అధ్యక్షునిగా నోముల సతీష్

కురుమ సంఘం మండల అధ్యక్షునిగా మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన నోముల సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కురుమల మండల స్థాయి సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షునిగా విసునూరు గ్రామానికి చెందిన బేజారి సురేష్, ఉపాధ్యక్షులుగా కొలుపుల సుధాకర్, స్థానిక మల్లేష్, కర్ర రవీందర్, మండల ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన మల్యాల పరుశరాములు, ప్రచార కార్యదర్శిగా చేవెల్లి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా గుండ శ్రీనివాస్, మంగ శ్రీశైలం, జోగు భిక్షపతి, కోశాధికారిగా మారుజోడు చంద్రం, కార్యవర్గ సభ్యులుగా మొటిక బీరప్ప, మజ్జిగ కుమారస్వామి లను ఎన్నుకున్నారని జిల్లా కార్యదర్శి మల్లేష్ తెలిపారు. సతీష్‌ను కురుమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కురుమ సంఘం యూత్ అధ్యక్షునిగా శోభన్ బాబు

కురుమ సంఘం మండల యూత్ అధ్యక్షునిగా మంగ శోభన్ బాబు, ఉపాధ్యక్షులుగా పడిశ అశోక్, సీహెచ్.శ్రీనివాస్, జోగు మనోహర్, మండల కార్యదర్శిగా చేవెల్లి శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో జనగామ పట్టణ యూత్ కోశాధికారి నోముల మహేష్, లింగాల ఘనపురం మండల యూత్ అధ్యక్షులు దయ్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కు వ్యతిరేకంగా నిరసన..

నవతెలంగాణ-బచ్చన్నపేట

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ వ్యతిరేకంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బచ్చన్నపేట మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు లింకు పెట్టడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయాలని, పెరిగిన పెట్రోల్ డీజిల్ తగ్గించాలని నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల, అధ్యక్ష కార్యదర్శులు తాడెం రాములు, ఇంజ ఎల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు గంగరబోయిన సమ్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మణెమ్మ, కలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ పోరాటాల ఫలితంగానే వేతనాలు విడుదల

నవతెలంగాణ-గార్ల:

సీఐటీయూ అధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో దశలవారీగా చేపట్టిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం 6 నెలల వేతనాలు విడుదల చేశారని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్షులు బండ్ల అప్పిరెడ్డిలు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పిడిమర్తి దాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



ప్రభుత్వం ఇన్సూరెన్స్ చేసుకునే జీవో విడుదల చేసిందని, గ్రామ పంచాయతీ కార్మికులు అందరికి గ్రామ పంచాయతీ నిధుల నుండి ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ కార్మికులను కారణం లేకుండా తొలగించడానికి వీలులేదని, కొత్త వారిని చేర్చుకోవటానికి వీలు లేకుండా ఉన్న జీవోను పటిష్టంగా అమలు చేయాలని, 51వ జీవో సవరణ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఆదివారం సెలవు దినంగా ప్రకటించాలని, కనీస వేతనం రూ.26 వేలు, 200 గజాల ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, సంవత్సరానికి రెండు జతల దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల వేతనాలు విడుదలకు చేసిన పోరాటం లో అండగా ఉన్న రాష్ట్ర కమిటీకి కార్మికులు ధన్యావాదాలు తెలిపారు. ఈసమావేశంలో మండల దస్తగిరి, ఉపేందర్, భద్రు, అశోక్, వీరాస్వామి, ప్రేమ్, రాజు తదితరులు ఉన్నారు.



విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

నవతెలంగాణ- జఫర్‌గడ్

ప్రతి విద్యార్థి విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరుచుకొని ఆ దిశగా కృషి చేయాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం, అవోపా సేవాసంఘం నాయకులు విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో అవోపా, డీటీఎఫ్ సంయుక్తంగా 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్, అవోపా నేతలు మాట్లాడుచూ ప్రతీ విద్యార్థి పోటీ పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని సబ్జెక్ట్ మీద పట్టు సాధించిన విద్యార్థులు ఎక్కడైనా రాణించగలుగుతారన్నారు.వచ్చే నెలలో జరుగనున్న పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురేష్, బెలిదె పూర్ణచందర్, దొడ్డ రాజ్ కుమార్, బోనగిరి శ్రవణ్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు చిలుకమర్రి వెంకటాచార్యులు, బజ్జూరి మెడికల్ కృష్ణమూర్తి, బెలిదె హరిశంకర్, అక్షిత్, అజిత్ ఖాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తమ్మడపల్లి-జి విద్యార్థిని చిలువేరు మౌనశ్రీ ప్రథమ బహుమతి, ఇదే పాఠశాలకు చెందిన సముద్రాల తేజస్విని ద్వితీయ, జఫర్ గడ్ ఉన్నత పాఠశాలకు చెందిన జబీన్ ఫాతిమా తృతీయ బహుమతులను పొందారు. ఈసందర్భంగా విజేతలను నిర్వాహకులు అభినందించారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల హవా

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



న్యూ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో స్టేషన్ ఘన్‌పూర్, తాటికొండ, చాగల్ గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కటాస్ విభాగంలో అత్యుత్తమంగా ప్రతిభ కనబరిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈకరాటే పోటీలకు ముఖ్య అతిథిగా థాయిలాండ్ కు చెందిన గ్రాండ్ మాస్టర్ ప్రేమ్ చందర్ సింగ్, సినీ నటులు భాను చందర్ చేతులమీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అండర్-14, అండర్-12బిలో గ్రూపు ఏ, బి అండర్ 10 జట్టు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈకార్యక్రమంలో పెసరు సారయ్య, వంగ శ్రీనివాస్, రజాక్ , జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి విమర్శలు హాస్యాస్పదం

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంతోష్

నవతెలంగాణ-తొర్రూర్

ప్రజాసంక్షే మ మే ధ్యేయంగా చిత్త శుద్ధితో పని చే స్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి విమర్శలు హాస్యాస్పదమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇప్పటికీ ఓటమిని జీర్ణించుకోవడంలేదని, అభివృద్ధి చేసే వారిపై అక్కసు వెలగక్కుతున్నాడని తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డిలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారికి పేరు దక్కవద్దని ఎర్రబెల్లి కుట్రలు పన్నడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల ప్రజలను అరిగోసపెట్టిన గులాబీ నాయకులు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు రవి నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, ఎంసీపీ డైరెక్టర్ కంచర్ల వెంకటాచారి, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అభిరాం నాయక్, పట్టణ అధ్యక్షుడు బసనబోయిన మహేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వెన్నెం సోమిరెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్, జాటోతు సంతోష్, మేఘ్యనాయక్, నల్లమాస మహేష్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు రోహిత్ కుమార్, గద్దల పరుశ రాములు, నాయకులు మహమ్మద్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు.. ఇంటికి వెలుగు

నవతెలంగాణ-మరిపెడ

బాలికల చదువు.. ఇంటింటికి వెలుగు అని మత పెద్దలు మౌలానా అమ్మర్ అబీద్ అన్నారు. ఆదివారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలో హౌసింగ్ బోర్డ్(సీతారాంపురం) శివారులో ఉన్న మదర్సా - యే- ఇస్లామియా రౌజాతుల్ బనాత్ బాలకల అరబ్బీ పాఠశాల మదర్సా లో 'దీని ఇల్మ్' పట్ల అవగాహన సదస్సు జరిగింది. .ఈ సదస్సులో మత పెద్దలు మౌలానా అమ్మర్ అబీద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు."దీన్ ఇల్మ్" యొక్క ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ (బంగ్లా)ముస్లిం పురప్రముఖులు సీతారాంపురం, హౌసింగ్ బోర్డ్ మత పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బయ్యారం:

మండల కేంద్రంలో ఫిబ్రవరి 15వ తేదీన జరిగే సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలు, భారీ భోగ్ బండారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేవాలాల్ సేన నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సేవాలాల్ సేన జయంతి ఉత్సవాలలో లంబాడీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బంజారా నాయకులు ఆంగోతు శ్రీకాంత్‌నాయక్, బానోతు రామునాయక్, జరుపుల శ్రీను నాయక్, ధరావత్ నాగు నాయక్, భూక్య రవినాయక్, ఆంగోతు ఏసు నాయక్, బానోతు గోపాల్‌నాయక్, అజ్మీర కోటేశ్వర్‌రావునాయక్, బానోతు రవీందర్‌నాయక్, ఆంగోతు రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.